# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 201 శుక్రవారం 26 జనవరి 2024 పేజీలు : 8 వెల : 5/-
Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




# దశాబ్ద కాలం తర్వాత డీఆర్‌సీ

- అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.
- శాఖాపరంగా సమగ్ర అవగాహన, సమాచారం లేనివారిపై మంత్రి అసహనం
- పరీక్షల్లో ఉత్తీర్ణతపై సమ్మతి లేఖ తప్పనిసరి
- అధునాతన చేపల మార్కెట్ ఏర్పాటు
- కలెక్టరేట్‌కు కొత్త భవనాన్ని నిర్మిస్తాం..

హైదరాబాద్

హైదరాబాద్ జిల్లా అభివృద్ధిపై బుధవారం సుమారు 4 గంటల పాటు సుదీర్ఘమైన సమీక్ష సమావేశం జరిగింది. దాదాపు దశాబ్ద కాలం తర్వాత డీఆర్‌సీ సమావేశ దృశ్యం కనిపించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఇన్‌చార్జి మంత్రి హోదాలో పొన్నం ప్రభాకర్ జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా పూర్తి స్థాయి వివరాలు, అభివృద్ధి పనుల పురోగతి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రస్తుత పరిస్థితిపై అధికారులతో ఆరా తీయడంతోపాటు -మిగతా3లో


# ఫిబ్రవరిలో మరో రెండు హామీలు

- పులి బయటకు వస్తుందంటున్నారు..
- బోను రెడీగా ఉంది: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- చార్లెస్ శోభరాజ్ పడుకుంటే బిల్లా, రంగాలు ఊరూరు తిరుగుతున్నారన్న సీఎం రేవంత్ రెడ్డి
- చార్లెస్ శోభరాజ్‌ను బయటకు రమ్మనండంటూ ముఖ్యమంత్రి వ్యాఖ్య
- ఒక్క హామీని నెరవేర్చని బీఆర్ఎస్‌కు మా గ్యారెంటీలపై ప్రశ్నించే హక్కు ఉందా? అని నిలదీత
- అక్కడ మోదీకైనా, ఇక్కడ కేడీకైనా బుద్ధి చెప్పేది కాంగ్రెస్ మాత్రమే
- ఇంద్రవెల్లికి వస్తున్నాను... ఇక కాసుకోండి:
- పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రేవంత్ రెడ్డి



హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా ప్రధాని మోదీ, మాజీ సీఎం కేసీఆర్‌లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్రంలో మోదీకైనా, రాష్ట్రంలో కేసీఆర్‌కు అయినా బుద్ధి చెప్పేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఆయన ఉద్ఘాటించారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో బూత్ స్థాయి లీడర్లతో నిర్వహించిన టీపీసీసీ కార్యక్రమంలో భాగంగా ఆయన ఈమేరకు విరుచుకుపడ్డారు. తమ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేసి చరిత్ర సృష్టించారని అన్నారు. ఆ యాత్ర ప్రభావంతో కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని చెప్పారు. దేశంలో త్యాగం -మిగతా3లో



## 'మూన్ స్నైపర్' శీర్షాసనం!


- 'మూన్ స్నైపర్' ల్యాండర్‌ను ప్రయోగించిన జపాన్
- 'వెల్లకిలా పడిన తాబేలు పోజు'
- తల కిందికి పెట్టి కాళ్లు పైకెత్తింది

# వంట నూనె ధరలు తగ్గింపు?

- ఉక్రెయిన్-రష్యా యుద్ధం తర్వాత పెరిగిన ధరలు ఇప్పటికీ అధికంగానే..
- దేశ ప్రజలపై ధరల భారాన్ని తగ్గించేందుకు రంగంలోకి కేంద్రం
- ఆయిల్ ధరల తగ్గుదలకు అనుగుణంగా తమ ఉత్పత్తుల ధరలను తగ్గించాలని భారత ప్రభుత్వం వంట నూనె తయారీ సంస్థలను ఆదేశం
- సాధ్యం కాదని వంటనూనెల కంపెనీలు ప్రభుత్వానికి వెల్లడించినట్లు మీడియా కథనాలు



# బీహార్‌లో పతనం దిశగా మహాకూటమి సర్కార్



- అసెంబ్లీని రద్దు చేసే యోచనలో సీఎం నితీష్ కుమార్ ఉన్నారని సమాచారం.
- లోక్ సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లే యోచనలో సీఎం నితీష్ కుమార్
- ఇటీవల రాష్ట్రంలో నితీష్ కుమార్ తీరుపై లాలూ కుమార్తె రోహిణి ఫైర్
- నితీష్ కుమార్ పచ్చి అవకాశవాది అంటూ ట్వీట్
- బిహార్ సీఎం నితీష్ కుమార్ మరోసారి బీజేపీతో కలిసిపోనున్నారని సమాచారం.
- ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మహాకూటమి(మహాగత్‌బంధన్) నుంచి వైదొలగనున్నారని విశ్వసనీయ వర్గాలు వెల్లడి

# బీఆర్ఎస్.. మళ్లీ టీఆర్ఎస్?

- సీఎం రేవంత్‌రెడ్డి సాధించింది వారానికి రెండు ఢిల్లీ టూర్లు
- దావోస్‌కు వెళ్లి ప్రపంచ వేదికపై పచ్చి అబద్ధాలు
- భేషజాల వల్లే ప్రగతిభవన్‌ను సీఎం వాడటం లేదు
- ఫిబ్రవరి 10లోగా అసెంబ్లీ సెగ్మెంట్లలో మా పార్టీ భేటీలు
- బీఆర్ఎస్ పేరు మార్పు అంశంపై చర్చిస్తున్నాం

హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ధ్వజమెత్తారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి 45 రోజులైనా సాధించింది ఏమీ లేదని మండిపడ్డారు. సీఎం రేవంత్ సాధించింది ఏమైనా ఉందంటే అది వారానికి రెండు ఢిల్లీ టూర్లు మాత్రమేనని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలనంతా ఢిల్లీ నుంచే సాగుతుందని కేటీఆర్ విమర్శించారు. దావోస్‌కు వెళ్లి ప్రపంచవేదికపై పచ్చి అబద్ధాలే మాట్లాడారన్నారు. 'అనేక విషయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకుంటుంది. కేఆర్ఎంబీ విషయంలో ప్రాజెక్టులు కేంద్రం చేతుల్లోకి వెళ్లాయి. మహబూబ్‌నగర్, ఖమ్మం, నల్గొండ జిల్లాలు తీవ్రంగా నష్టపోతాయి. రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ మాటలు ఒకేలా ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త సచివాలయం కడితే గగ్గోలు పెట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు కొత్త క్యాంపు ఆఫీసు, కొత్త హైకోర్టు ఎట్లా కడుతున్నారు?, సీఎం మారినప్పుడల్లా కొత్త క్యాంపు ఆఫీసులు వస్తాయా?, మేము కట్టిన ప్రగతి భవన్‌ను ఈగోతో డిప్యూటీ సీఎం భట్టికి రేవంత్‌రెడ్డి ఇచ్చారు. క్యాబినెట్‌లో చర్చించకుండానే రేవంత్‌రెడ్డి నిర్ణయాలు తీసుకుంటున్నారు. భేషజాల వల్లే ప్రగతిభవన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి వాడటం లేదు. మేము దావోస్ పర్యటనలకు వెళ్తే బోగస్ అన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనపై సమాధానం చెప్పాలి. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనకు ఎందుకు వెళ్లారని భట్టి ప్రశ్నించినట్లు ఉంది. రేవంత్‌రెడ్డిపై భట్టి యుద్ధం చేస్తున్నట్లు అనిపిస్తోంది. -మిగతా3లో





# అలా మాట్లాడే వాళ్లను చెప్పుతో కొట్టే రోజులొస్తాయ్

- వచ్చే వారంలోనే బీజేపీ అభ్యర్థుల ప్రకటన ఉండే అవకాశం
- కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- 28న అమిత్ షా తెలంగాణలో పర్యటన
- హైదరాబాద్ పార్లమెంట్‌పై బీజెపి సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లీస్ పార్టీని బుజ్జగించే ప్రయత్నాలు


హైదరాబాద్

పార్లమెంట్ అభ్యర్థుల ఎంపిక పూర్తవుతుందని, వచ్చే వారంలోనే బీజేపీ అభ్యర్థుల ప్రకటన ఉండే అవకాశం ఉందని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. 28న అమిత్ షా తెలంగాణలో పర్యటించనున్నారు. హైదరాబాద్ పార్లమెంట్‌పై బీజెపి సన్నాహక సమావేశం -మిగతా3లో

# 'మూన్ స్నైపర్' శీర్షాసనం!

చంద్రుడి ఉపరితలంపై సజావుగా దిగి శోధించడానికి 'స్మార్ట్ ల్యాండర్ ఫర్ ఇన్వెస్టిగేటింగ్ మూన్' (స్లిమ్)ను జపాన్ ఏరో స్పేస్ ఎక్స్ప్లోరేషన్ ఏజెన్సీ 'జాక్సా' ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ ల్యాండర్ ముద్దు పేరు 'మూన్ స్నైపర్'. భారత కాలమానం ప్రకారం ఈ నెల 19వ తేదీ రాత్రి 8:50 గంటలకు జాబిలి నేలపై 'మూన్ స్నైపర్' దిగడానికైతే మృదువుగా, సాఫీగానే దిగింది. కానీ.. పక్కకు దొల్లిపోయి 'వెల్లకిలా పడిన తాబేలు' మాదిరి తలకిందులు అయింది.

ల్యాండింగ్‌లో సంభవించిన ఈ లోపం కారణంగా 'జాక్సా' ప్రస్తుతం భారీ మూల్యమే చెల్లించుకుంటోంది. చంద్రుడిపై తాను దిగడానికి కొన్ని క్షణాల ముందుగా ల్యాండర్ జారవిడిచిన రెండో రోవర్ (లూనార్ ఎక్స్కర్షన్ వెహికల్-2) ఈ ఫొటో తీసింది. సూర్యకాంతిని గ్రహించి, సౌరవిద్యుత్ ఉత్పత్తి చేసి ల్యాండర్ బ్యాటరీని ఛార్జ్ చేయాల్సిన సౌరఫలకాలు(సోలార్ ప్యానెల్స్)ప్రస్తుతం సూర్యుడికి అభిముఖంగా లేవు. అవి ల్యాండర్ తల భాగంలో (కింది వైపు) సూర్యుడికి వ్యతిరేక దిశలో (ఆవలి వైపు) ఉన్నాయి. చంద్రుడిపై 15 రోజులు పగలు, 15 రోజులు రాత్రి ఉంటాయి. చంద్రుడి ఈక్వేటర్ (చంద్రమధ్యరేఖ)కు దక్షిణంగా షియోలీ బిలం వాలులో సూర్యోదయ వేళలో ల్యాండర్ జాబిలిపై కాలుమోపాల్సింది పోయి 'తలమోపింది'. 'మూన్ స్నైపర్' దిగిన ప్రదేశంలో ఇప్పుడు మధ్యాహ్న సమయం. అంటే.. ల్యాండర్ పై భాగంలో సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. సూర్యుడి కోణం మారి ఎండ కాస్త ఆవలి వైపునకు వెళితే సౌరఫలకాలకు సోకుతుంది. ప్రస్తుతం నిద్రాణ స్థితిలో ఉన్న 'స్లిమ్' వ్యోమనౌకలోని ఆన్బోర్డ్ బ్యాటరీలో 12% పవర్ మిగిలివుంది. వ్యోమనౌక సోలార్ ప్యానెళ్లకు సూర్యరశ్మి అందుబాటులోకొస్తే బ్యాటరీని పునఃప్రారంభించాలని (రీ-స్టార్ట్ చేయాలని) 'జాక్సా' తలపోస్తోంది. అప్పుడు 'మూన్ స్నైపర్' ల్యాండర్ కోలుకునే అవకాశాలు ఉంటాయి. ఈ ప్రయత్నంలో జపాన్ సఫలం కావాలని కోరుకుందాం.



**ఆ 100 మీటర్ల స్పాట్‌లోనే దిగాం**

అసాధారణ రీతిలో కచ్చితత్వంతో కూడిన (ప్రెసిషన్) ల్యాండింగులో సఫలమైనట్టు ప్రకటించిన జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ 'జాక్సా'. ఈ నెల 19న చంద్రుడిపై కాలుమోపే ఆఖరి అంకంలో 'మూన్ స్నైపర్'లోని రెండు ప్రధాన ఇంజిన్లలో ఒక ఇంజిన్ పనిచేయడం ఆగిపోయిందట. ఫలితంగా వ్యోమనౌక చంద్రుడి ఉపరితలంపై షియోలి బిలం వాలులో సమతాస్థితి తప్పి, దొర్లి, శాస్త్రవేత్తలు నిర్దేశించిన లక్ష్యిత ప్రదేశం నుంచి నెమ్మదిగా 55 మీటర్ల ఆవలకు కొట్టుకెళ్లి అవాంఛిత స్థితి (భంగిమ)లో నిలిచిపోయిందని వెల్లడించిన 'జాక్సా'. ఇంజిన్ సమస్యే కనుక లేకపోతే నిర్దేశిత ప్రాంతానికి 3-4 మీటర్ల సమీపంలోనే ల్యాండర్ బహుశా దిగి ఉండేదని సంస్థ తెలిపింది. మన 'చంద్రయాన్-3'లోని 'విక్రమ్' ల్యాండర్ మాదిరిగానే 'మూన్ స్నైపర్' ల్యాండర్ కూడా చంద్రుడి ఉపరితలంపై మైనస్ డిగ్రీల్లో ఉండే రాత్రి వేళల అతి చలి ఉష్ణోగ్రతలను తట్టుకోలేదు. మరో వారం రోజుల లోపు సౌరవిద్యుత్ తయారై, దాని సాయంతో మేలుకుంటే 'మూన్ స్నైపర్' బతికినట్టు. లేదంటే ఆశలు వదిలివేసుకోవడమే! మరోవైపు... జాబిలి ఉపరితలంపై ముందుగా నిర్ణయించిన ప్రదేశంలోనే (లక్ష్యంగా నిర్దేశించిన 100 మీటర్ల స్థలి) దిగామో, లేదో నిర్ధారించేందుకు ల్యాండర్ పంపిన డేటాను 'జాక్సా సవివరంగా విశ్లేషిస్తున్నట్టు మరికొన్ని కథనాలు వెల్లడించాయి.


# బీహార్‌లో పతనం దిశగా మహాకూటమి సర్కార్

**పాట్నా:** బీహార్ అసెంబ్లీని రద్దు చేసే యోచనలో సీఎం నితీష్ కుమార్ ఉన్నారని సమాచారం. లోక్ సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల రాష్ట్రంలో నితీష్ కుమార్ తీరుపై లాలూ కుమార్తె రోహిణి ఫైర్ అయ్యారు. నితీష్ కుమార్ పచ్చి అవకాశవాది అంటూ ట్వీట్ చేశారు. దీంతో మాహా కూటమిలో ఉన్న జేడీయూ, ఆర?జీడీ మధ్య విభేదాలు బయటకొచ్చాయి. బిహార్ రాజకీయ క్షేత్రంలో కీలక మలుపులు చోటుచేసుకోబోతున్నాయి. బిహార్ సీఎం నితీష్ కుమార్ మరోసారి బీజేపీతో కలిసిపోనున్నారని సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మహాకూటమి (మహాగత్‌బంధన్) నుంచి వైదొలగనున్నారని విశ్వసనీయ వర్గాలు తెలుపుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ఇండియా కూటమికి అతిపెద్ద షాక్ తగలనుంది.

నితీష్ కుమార్ 2013 నుంచి ఎన్డీయే, మహాఘట్‌బంధన్ మధ్య ఊగిసలాడుతున్నారు. నిత్యం పొత్తులతో జిమ్మిక్కులు చేస్తూ సీఎం పదవిని చేజిక్కించుకుంటూ వచ్చారు. మహాకూటమి నుంచి వైదొలిగి ఎన్డీయేలో చేరిన రెండేళ్లకే చివరిసారిగా 2022లో ఆయన మళ్లీ మహాకూటమిని ఏర్పరిచారు. 2020లో బిహార్‌లో చివరిసారి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. జేడీయూ, ఆర్జేడీ, కాంగ్రెస్ సహా స్థానిక పార్టీలతో కలిసి మహాకూటమి పేరుతో ప్రభుత్వం ఏర్పడింది. నితీష్ కుమార్ సీఎం అయ్యారు.

**అనుమానాలకు ఆజ్యం..**

దివంగత సీఎం కర్పూరీ రాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం ఇటీవల భారత రత్న ప్రకటించడాన్ని నితీష్ ప్రభుత్వం స్వాగతించింది.



అంతేకాకుండా వంశపారంపర్య రాజకీయాలను ఎత్తిచూపుతూ ఆర్జేడీ టార్గెట్‌గా నితీష్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. కర్పూరీ ఠాకూర్ చూపిన మార్గంలోనే తమ పార్టీ పయనిస్తోందని నితీష్ పేర్కొన్నారు. కొన్ని పార్టీలు తమ వారసులకు రాజకీయ భవిష్యత్ కోసం పోరాడుతారని విమర్శించారు. నితీష్ వ్యాఖ్యలపై ఆర్జేడీ నేత లాలూ కుమార్ కుమార్తె రోహిణీ ఘాటుగా స్పందించారు. కొందరు తమ సొంత లోపాలను చూసుకోలేరు.. ఇతరులపై బురద జల్లుతారు అంటూ ట్విట్టర్ వేదికగా మండిపడ్డారు. ఈ పరిణామాలు బీజేపీ వైపు నితీష్ కుమార్ అడుగులు పడుతున్నాయనడానికి అనుమానాలను పెంచుతున్నాయి.

**జోడో యాత్రలో జాయిన్ కారు..**

అటు.. జనవరి 30న బిహార్‌లో ప్రవేశించే కాంగ్రెస్ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో నితీష్ కుమార్ హాజరుకాబోరని పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడు షకీల్ అహ్మద్ ఖాన్ ద్వారా నిన్న సాయంత్రం ఆహ్వానం అందిందని.. అయితే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి సీట్ల పంపకాల చర్చల్లో జాప్యం జరగడంతో నితీష్ కుమార్ కలత చెందారని వెల్లడించాయి.

# మళ్లీ గ్యాస్ చాంబర్‌గా ఢిల్లీ

దేశ రాజధాని ఢిల్లీని చలిగాలులు చుట్టుముట్టాయి. గాలి దిశలో మార్పు కారణంగా ఢిల్లీ మరోసారి గ్యాస్ ఛాంబర్‌గా మారింది. గాలి వేగం తక్కువగా ఉండడంతో గురువారం ఉదయం నుంచి ఆకాశంలో పొగమంచు కమ్ముకుంది. ఢిల్లీలో బుధవారం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 409 వద్ద నమోదైంది. ఇది మంగళవారం కంటే 41 సూచీలు అధికం. గురువారం ఉదయం నుంచి రాజధానిలో దట్టమైన పొగమంచు కమ్ముకుంది. మధ్యాహ్నం వేళ కూడా సూర్యరశ్మి తక్కువగానే ఉంది. రాత్రి అయ్యేసరికి వాతావరణం మరింత చల్లగా మారిపోతోంది. పెరుగుతున్న వాయు కాలుష్యం కారణంగా జనానికి కంటి, శ్వాస సమస్యలు ఎదురవుతున్నాయి. బుధవారం ఢిల్లీలోని 13 ప్రాంతాల్లో



ఏక్యూఐ 400గా నమోదైంది. శనివారం వరకు పరిస్థితులు మెరుగుపడే అవకాశం లేదని వాతావరణ శాఖ తెలిపింది. ఆ శాఖ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం గాలి పశ్చిమం నుండి ఉత్తరం వైపునకు సగటున గంటకు ఆరు నుండి ఎనిమిది కిలోమీటర్ల వేగంతో వీచింది. రాబోయే రెండు రోజులలో వివిధ దిశల నుండి గాలి వీయనుంది. శుక్రవారం ఈశాన్యం నుండి వాయువ్య దిశలో గాలి వీయనుంది. దాని వేగం నాలుగు నుండి ఎనిమిది కిలోమీటర్లుగా ఉండవచ్చు. శనివారం వాయువ్యం నుండి పశ్చిమ దిశగా గాలి వీచే అవకాశం ఉంది. ఈ సమయంలో గాలి వేగం గంటకు ఆరు నుంచి 12 కిలో మీటర్లుగా ఉండవచ్చు. అందుకే ఈ వారం అంతా గాలి నాణ్యత పేలవంగానే ఉండవచ్చని వాతావరణశాఖ అంచనా వేసింది.

## జయలలిత నివాసం ఎదురుగా శశికళ కొత్త ఇల్లు...

## లాంఛనంగా గృహప్రవేశం

**జయలలితకు అత్యంత సన్నిహితురాలిగా శశికళకు గుర్తింపు**

**దాదాపు 30 ఏళ్లు జయతో వేద నిలయం నివాసంలో ఉన్న శశికళ**

**జయ మరణానంతరం ప్రాభవం కోల్పోయిన 'చిన్నమ్మ'**

తమిళనాడు రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి జయలలితకు అత్యంత సన్నిహితురాలిగా, ఆమె ఆత్మగా మెలిగిన శశికళ తన కొత్త ఇంట్లో అడుగుపెట్టారు. చెన్నైలోని పొయెస్ గార్డెన్ ప్రాంతంలో జయలలిత ఇంటి ఎదురుగానే శశికళ కొత్త ఇంటిని నిర్మించుకున్నారు. నిన్న పూజా కార్యక్రమాలు నిర్వహించి, లాంఛనంగా నూతన గృహ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమానికి శశికళ బంధువులు హాజరయ్యారు. పొయెస్ గార్డెన్ లోని వేద నిలయం నివాసంలో జయలలితకు తోడుగా శశికళ దాదాపు 30 ఏళ్లు ఉన్నారు. 'చిన్నమ్మ'గా గుర్తింపు పొందారు. ఈ మూడు దశాబ్దాల కాలంలో అన్నాడీఎంకేలో శశికళ మాట వేదవాక్కులా చెలామణీ అయింది. 2016లో జయ మరణానంతరం శశికళను పట్టించుకున్నవారే లేరు. దానికితోడు



అక్రమార్జన కేసులో నాలుగేళ్లు జైలులో గడిపిన శశికళ.... జైలు నుంచి విడుదలైనప్పటికీ సాధారణ వ్యక్తిలానే మిగిలిపోయారు. దానికితోడు అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురికావడంతో రాజకీయాల్లో ఆమె పాత్ర ఏ రూపంలోనూ లేకుండా పోయింది.

## చిగురుమళ్ళ శ్రీనివాస్

## 100 దేశాల శాంతియాత్ర అభినందనీయం

**బెహ్రాయిన్ ఇండియన్ అంబాసిడర్**

**దోహ :** బెహ్రాయిన్ లో తానా ప్రపంచ సాహిత్య వేదిక కన్వీనర్ చిగురుమళ్ళ శ్రీనివాస్ నిర్వహిస్తున్న 100 దేశాలలో శాంతి సద్భావనా ప్రపంచ యాత్ర ఘనంగా జరిగింది. తెలుగు కళా సమితి - బెహ్రాయిన్ అధ్యక్షులు తక్కెళ్ళపాటి హరిబాబు, పూర్వ అధ్యక్షులు శివ యెల్లపు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వందలాది మంది ప్రవాస తెలుగువారు పాల్గొన్నారు. బెహ్రాయిన్ లోని ఇండియన్ అంబాసిడర్ వినోద్ కే జాకబ్ మాట్లాడుతూ 100 దేశాలలో శాంతి యాత్ర నిర్వహిస్తూ, మానవాళి ని చైతన్య పరచరడం అభినందనీయం అన్నారు. దీనిలో భాగంగా అమ్మ నాన్న గురువు శతక పద్యార్చన, మొక్కనాట వోయి ఒక్కటైన లాంటి కార్యక్రమాలు నిర్వహించడం భావి తరాలకు ఎంతో అవసరం, వీరి కృషి శ్లాఘనీయం అన్నారు. టీకేఎస్ అధ్యక్షుడు హరిబాబు మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి శాంతి సందేశాన్ని అందించడానికి, విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని చాటటానికి సాహిత్యం ద్వారా సామాజిక చైతన్య కలిగించడానికి శ్రీనివాస్ "వందే విశ్వమాతరమ్" పేరుతో వంద దేశాల శాంతి సద్భావనా యాత్ర నిర్వహించటం అభినందనీయమని అన్నారు. చిగురుమళ్ళ మాట్లాడుతూ తానా మరియు 100 దేశాలలో ఉన్న వందకు పైగా తెలుగు సంఘాల సమన్వయంతో తానా అధ్యక్షులు నిరంజన్ శృంగవరపు, వందేవిశ్వ మాతరమ్ చైర్మన్ జయశేఖర్ తాళ్ళూరి సారథ్యంలో ఈ బృహత్ అక్షర యజ్ఞం జరుగుతోంది. నవంబర్ తొమ్మిదో తారీఖున బోట్స్ వానాలో ప్రారంభించి, ఆఫ్రికా ఖండంలోని దేశాల యాత్ర అనంతరం రెండవ దశలో భాగంగా మధ్య ప్రాచ్య దేశాల శాంతి యాత్ర నిర్వహిస్తున్నాము. మానవ ప్రవర్తనలో పరివర్తన తీసుకురావడం సాహిత్యం ద్వారా సాధ్యమవుతుందని అన్నారు. మధ్య ప్రాచ్య దేశాల యాత్ర కన్వీనర్ లుగా సుధాకర్ కుదరవల్లి, విక్రమ్ సుఖవాసి వ్యవహరిస్తున్నారు. ఆత్మీయ సమ్మేళనంలో ఫనిభూషణరెడ్డి .టి, వంశీధర్. జి, ప్రవీణ్ సీ. హెచ్, ఫణి హనుమంతరావు, విజయేంద్ర రెడ్డి, రామ శ్రీను, శ్రీనివాస్ రెడ్డి. సి తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

**తొప్పూర్ ఘాట్ రోడ్ వద్ద ఓ వంతెనపై మూడు ట్రక్కులు, రెండు కార్లు ఢీ**

**నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం**



**చెన్నయ్ :** తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ధర్మపురి జిల్లాలోని తొప్పూర్ ఘాట్ రోడ్ వద్ద ఓ వంతెనపై బహుళ వాహనాలు ఢీకొన్నాయి. మూడు ట్రక్కులు, రెండు కార్లు ఢీకొనడంతో.. నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం పొందారు. మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలవ్వగా.. చికిత్స నిమిత్తం వారిని వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు. ఒళ్ళు గగుర్పొడిచే ఈ ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకోగా.. సీసీటీవీ కెమెరాలో దృశ్యాలు రికార్డ్ అయ్యాయి.ఆ వీడియోని గమనిస్తే.. వేగంగా దూసుకొస్తున్న ఈ ట్రక్కు ఎదురుగా వెళ్తున్న రెండు ట్రక్కులను ఢీకొంది. దీంతో.. ఒక ట్రక్కు అదుపు తప్పి వంతెనలో పడిపోయింది. ఈ మూడు ట్రక్కుల మధ్య వెళ్తున్న ఒక కారు నుజ్జునుజ్జు అయ్యింది. ఇంతలోనే ఓ ట్రక్కుకు మంటలు అంటుకున్నాయి. మరోవైపు.. ఈ ప్రమాదంలో అనుసరిస్తున్న మరో కారు కూడా ధ్వంసం అయ్యింది. ఫలితంగా.. ఇద్దరు మహిళలతో కలిపి మొత్తం నలుగురు మృతి చెందారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్.. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అలాగే.. గాయాలైన వారికి రూ.50 వేల సహాయాన్ని అందజేశారు.ఈ ఘటనపై ధర్మపురి డీఎంకే ఎంపీ సెంథిల్ కుమార్ స్పందిస్తూ.. పెండింగ్‌లో ఉన్న ఎలివేటెడ్ నేషనల్ హైవే పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటాయన్న భయంతోనే తాము తొప్పూర్ ఘాట్ సెక్షన్ వద్ద మంజూరైన ఎలివేటెడ్ హైవేని సత్వరమే అమలు చేయాలని పట్టుబడుతున్నామని ఆయన అన్నారు.

## వంట నూనె ధరలు తగ్గింపు?



అంతర్జాతీయంగా ఏదైనా అనిశ్చిత పరిస్థితులు ఎదురైతే వెంటనే దాన్ని ప్రభావం ప్రపంచంలోని అన్ని దేశాలపై పడుతుంది. ఇతర దేశాల నుంచి వస్తువులను దిగమతి చేసుకుంటున్న దేశాలకైతే మరింత దారుణమైన పరిస్థితులు ఏర్పడుతాయి. దాంతో వస్తువులు, ఆహారసామగ్రి ధరలు పెరుగుతాయి. ఆ సాకుతో కంపెనీలు అడ్డగోలుగా క్యాష్‌ఫ్లోలు పెంచుకుంటాయి. తిరిగి ఆ అనిశ్చిత పరిస్థితులు సద్దుమణిగినా ఏ మేరకు ధరలు పెంచారో ఆ రీతిలో వాటిని తగ్గించరు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం తర్వాత పెరిగిన వంటనూనె ధరలు ఇప్పటికీ అధికంగానే కొనసాగుతున్నాయి. దాంతో దేశ ప్రజలపై ధరల భారాన్ని తగ్గించేందుకు కేంద్రం రంగంలోకి దిగింది. ప్రస్తుతం అంతర్జాతీయంగా ఎడిబుల్ ఆయిల్ ధరల తగ్గుదలకు అనుగుణంగా తమ ఉత్పత్తుల ధరలను తగ్గించాలని భారత ప్రభుత్వం వంట నూనె తయారీ సంస్థలను ఆదేశించింది. అయితే ఇది వెంటనే సాధ్యం కాదని వంటనూనెల కంపెనీలు ప్రభుత్వానికి వెల్లడించినట్లు మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది. నూనెల ఉత్పత్తికి ఉపయోగించే కొన్ని పంటల కోతలు ప్రారంభమయ్యే మార్చి వరకు ధరల తగ్గింపు సాధ్యంకాదని పరిశ్రమల నిర్వాహకులు తేల్చి చెప్పారు. ప్రపంచంలోనే అత్యధికంగా వెజిటబుల్ ఆయిల్ దిగుమతి చేసుకునే దేశం భారత్ కావడం గమనార్హం. శుద్ధి చేసిన సోయాబీన్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై ప్రాథమిక దిగుమతి సుంకాన్ని గతేడాది జూన్‌లో 17.5% నుంచి 12.5%కి తగ్గించారు. అందుకు అనుగుణంగా ధరలు తగ్గించాలనే డిమాండ్ ఉంది. ఇండియా ప్రధానంగా ఇండోనేషియా, మలేషియా నుంచి పామాయిల్ దిగుమతి చేసుకుంటుంది. అర్జెంటీనా నుంచి సోయాబీన్‌తో సహా తక్కువ మొత్తంలో క్రూడ్ సాఫ్ట్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటుంది. ఉక్రెయిన్, రష్యా నుంచి సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటోంది. సోయాబీన్, సన్‌ఫ్లవర్, పామాయిల్ వంటి నూనెలపై అంతర్జాతీయంగా తగ్గిన ధరల మేరకు దేశంలో తగ్గించలేదని వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించిందని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అజయ్ తెలిపారు.

## కాంగ్రెస్‌కు షాక్..

## కమలం గూటికి మాజీ సీఎం జగదీష్ శెట్టర్




బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌కు భారీ షాక్ తగిలింది. కర్ణాటక మాజీ సీఎం జగదీష్ శెట్టర్ సొంత గూటికి చేరుకున్నారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన శెట్టర్.. తిరిగి కమలం గూటికే చేరారు. మాజీ సీఎం యడ్యూరప్ప, ఇతర సీనియర్ నేతల ఆధ్వర్యంలో గురువారం కాషాయ కండువా కప్పుకున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో పాటు ఇతర నేతలతో భేటీ అయిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. కాగా మరో మూడు నెలల్లో లోక్ సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జగదీష్ శెట్టర్ బీజేపీలో చేరడం ఆసక్తిగా మారింది. బహుశా ఆయన కాషాయ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసే అవకాశం ఉంది. కాగా జగదీష్ శెట్టర్.. కర్ణాటకలో రాజకీయంగా ప్రభావవంతమైన లింగాయత్ వర్గానికి చెందిన నేత.. బీజేపి నుంచి తన సొంత నియోజకవర్గం హుబ్లీ ధార్వాడ్ సెంట్రల్ సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన శెట్టర్‌కు.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్ నిరాకరించింది. దీంతో అసంతృప్తి చెందిన మాజీ ముఖ్యమంత్రి ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ తీర్థం పచ్చుకున్నారు. ఎన్నికల్లో మళ్లీ అదే స్థానం నుంచి కాంగ్రెస్ తరపున పోటి చేసిన తన పదవిని నిలబెట్టుకోలేకపోయారు. బీజేపీ నేత చేతిలో 34 వేల కోట్ల తేడాతో ఓటమిని చవిచూశారు.

# బీఆర్ఎస్.. మళ్లీ టీఆర్ఎస్?

-మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం టైంపాస్ ప్రభుత్వంగా మారింది. బెల్టు షాపులు ఎత్తివేస్తామని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

కాళేశ్వరం ద్వారా చుక్క నీరు రాలేదన్నారు. మంత్రి కొండా సురేఖ లక్షా పదివేల ఎకరాలకు రంగనాయక సాగర్ నీళ్లను విడుదల చేసిందుకు ధన్యవాదాలు. తెలంగాణ రైతులకు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే వంద రోజుల్లో హామీల అమలును నిలబెట్టుకోవాలి.కోటీ 57 లక్షల మంది మహిళలకు మహాలక్ష్మి ఎప్పటి నుండి ఇస్తారో చెప్పాలి. ఆరు గ్యారెంటీల అమలుకు జీవోలు ఇవ్వండి. ఎన్నికల కోడ్ పేరుతో తప్పించుకోవాలని చూస్తున్నారు' అని కేటీఆర్ ఆరోపించారు.

ఫిబ్రవరి 10లోగా అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్ఎస్ పార్టీ భేటీలు ఉంటాయన్న కేటీఆర్.. కేఆర్ఎంబీపై తెలంగాణ ప్రయోజనాల తాకట్టు, పార్టీ అంతర్గత నిర్మాణంపై దృష్టి కేంద్రీకరించామన్నారు. ఇక బీఆర్ఎస్ పేరు మార్పు అంశంపై చర్చిస్తున్నట్లు కేటీఆర్ స్పష్టం చేశారు.దాంతో బీఆర్ఎస్.. మళ్లీ టీఆర్ఎస్ కానుందా? అనే చర్చ మొదలైంది.

**మేము కట్టేవి వద్దన్నారు.. మరి మీరు చేస్తుందేంటి?**



హైకోర్టు నూతన భవన నిర్మాణానికి కాంగ్రెస్ సర్కార్ స్థలం కేటాయించడంతో పాటు.. అందుకుకావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తుండటంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. "మేము సచివాలయం కడితే అభ్యంతరం చెప్పారు. కొత్త అసెంబ్లీ కడతామంటే వద్దు అన్నారు. కానీ వాళ్లు వంద ఎకరాల్లో హైకోర్టు కడతామని అంటున్నారు. మరి దీన్ని ఏమంటారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవు అంటున్నారు... మరి సీఎంకు కొత్త క్యాంప్ కార్యాలయం కడుతున్నారు.. అవసరమా?" అంటూ ప్రశ్నలు సధించారు. సీఎంలు మారినప్పుడల్లా కొత్త క్యాంప్ కార్యాలయాలు కడతారా? అని నిలదీశారు.

రైతు భరోసా ఇస్తున్నట్లు రేవంత్ రెడ్డి దావోస్‌లో పచ్చి అబద్ధం చెప్పారని మండిపడ్డారు. అబద్ధం చెప్పిన సీఎం తెలంగాణ రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రేపు కేసీఆర్ పార్లమెంటరీ సమావేశం పెట్టారని.. గాయం తర్వాత కేసీఆర్ మొదటి సమావేశం నిర్వహిస్తున్నారన్నారు. ఎల్లుండి (జనవరి 27) తెలంగాణ భవన్‌లో మైనార్టీ సెల్ సమావేశం ఉంటుందన్నారు. శనివారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్ష సమావేశాలు ఉంటాయన్నారు. గ్రామ పంచాయితీ భవనాలు ప్రారంభం చేయకుండా ప్రభుత్వం ఆపుతోందని మండిపడ్డారు. సర్పంచ్‌ల మనోభావాలను దెబ్బ తీస్తోందన్నారు.

దమ్ముంటే ఎన్నికలు పెట్టాలని లేదంటే ఉన్న సర్పంచ్‌లకు పొడిగింపు ఇవ్వాలన్నారు. 80 శాతం బీఆర్ఎస్ సర్పంచ్‌లే ఉన్నారని ప్రభుత్వం దురాలోచనలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దౌల్తాబాద్ మండల సర్వసభ్య సమావేశంలో సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి ఏ హోదాలో కూర్చున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వానికి సలహాదారులు ఉండొద్దని గతంలో కోర్టుకు వెళ్లిందే రేవంత్ రెడ్డి అని గుర్తుచేశారు. మున్సిపాలిటీల్లో అవిశ్వాసాలు పెట్టిన చోట విప్ జారీ చేశామని.. విప్ ధిక్కరిస్తే చర్యలు తప్పవని కేటీఆర్ హెచ్చరించారు.

# ఫిబ్రవరిలో మరో రెండు హామీలు

-మొదటి పేజి తరువాయి

అంటే గాంధీ కుటుంబానిదే అని.. దేశ సమగ్రతను కాపాడేందుకు ఆ కుటుంబం ప్రాణాలను సైతం అర్పించిందని పేర్కొన్నారు. పదవులను సైతం త్యాగం చేసిన ఘనత రాహుల్ గాంధీది అని కొనియాడారు. అఖండ భారత్ అని చెప్పుకుంటున్న ప్రధాని మోదీ.. దేశం కోసం గాంధీ కుటుంబం ప్రాణాలు ఇచ్చినప్పుడు ఎక్కడున్నారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఉండడానికి సొంత ఇల్లు కూడా లేని గాంధీ కుటుంబానికి అవినీతి మరకలు అంటించాలని చూస్తున్నారని మండిపడ్డారు. గాంధీ కుటుంబాన్ని అవమానించిన బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. దేశంలో మోదీతో కాంగ్రెస్ యుద్ధం చేస్తుంటే.. సందట్లో సడెమియాలాగా వీధుల్లో బిల్లా-రంగాలు తిరుగుతున్నారని సెటైర్లు వేశారు. అధికారంలోకి వచ్చి ఇంకా యాభై రోజులు కూడా కాకముందే.. కాంగ్రెస్ పార్టీలు హామీలను అమలు చేయడం లేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇచ్చిన మాట ప్రకారం.. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు పదిన్నర కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని.. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని చెప్పారు. ఫిబ్రవరి మొదటి వారంలో మరో రెండు హామీలను అమలు చేయబోతున్నామన్నారు.

3650 రోజుల పాటు పాలించిన బీఆర్ఎస్.. ఈ రాష్ట్రాన్ని దివాళా తీయించారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చారని తూర్పారపట్టారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ తాము ఏ సంక్షేమ పథకాలను ఆపలేదన్నారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు రాష్ట్రంలోని 63 లక్షల రైతుల ఖాతాలకు రైతు భరోసా నగదు బదిలీ చేస్తామని మాటిచ్చారు. మాట్లాడితే మేస్త్రి అని విమర్శలు చేస్తున్నారని.. మీరు విధ్వంసం చేసిన తెలంగాణను పునర్నిర్మించే మేస్త్రీనని, నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చి వారి భవిష్యత్‌ను నిర్మించే మేస్త్రినని, తెలంగాణను దోచుకున్న బీఆర్ఎస్‌ను బొందపెట్టి ఘోరీ కట్టే మేస్త్రీనని కౌంటర్లు వేశారు. రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్రకు బీజేపీ అడ్డంకులు సృష్టిస్తోందని.. రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి కేంద్రంలో తప్పకుండా బుద్ధి చెప్తామని నిప్పులు చెరిగారు. అసెంబ్లీ ఎన్నికల్లో బుద్ధి చెప్పిన బిల్లా రంగాలను ఈ ఎన్నికల్లో పొలిమేరలు దాటేదాకా తరుముదామని వ్యాఖ్యానించారు.

ఇది కేవలం ఇంటర్వెల్ మాత్రమేని.. అసలు సినిమా ముందుందని రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. ఇంద్రవెల్లి వేదిక నుంచి అసలు సినిమా మొదలవుతుందని హెచ్చరించారు. బిల్లా రంగాలే కాదు.. చార్లెస్ శోభారాజ్ కూడా బయటకు రావాలన్నారు. పులి బయటకు వస్తే బోనులోకే వెళ్తుందని.. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మూసీలో



వేసినట్లేనని చెప్పారు. మోదీని ఓడించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేద్దామని పిలుపునిచ్చారు. కేసీఆర్.. ఆట మొదలైంది, ఇక కాస్కో అంటూ ఛాలెంజ్ చేశారు. గోల్కొండ కోటపై మువ్వన్నెల జెండా ఎగరవేశామని.. ఇక ఎర్రకోటపై మువ్వన్నెల జెండా ఎగరేద్దామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

**పులి బయటకు వస్తుందంటున్నారు..**

చార్లెస్ శోభరాజ్ ఇంట్లో పడుకుంటే బిల్లా, రంగాలు ఊరూరు తిరుగుతూ పులి బయటకు వస్తుందని చెబుతున్నారని... కానీ పులి బయటకు వస్తే బోను రెడీగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలు నెరవేరుస్తామని మనం చెప్పామని... కానీ బిల్లా, రంగాలు మాత్రం 50 రోజులు గడవకముందే హామీలు అమలు చేశారా? అని ప్రశ్నిస్తున్నారని విమర్శలు గుప్పించారు.

ఓ వైపు చార్లెస్ శోభరాజ్ ఇప్పుడు ఇంట్లో పడుకున్నారని... మరోవైపు బిల్లా, రంగాలు ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. చార్లెస్ శోభరాజ్‌ను బయటకు రమ్మనండి అంటూ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. పదేళ్లు అధికారంలో ఉండి దోచుకున్నాం... మిమ్మల్ని అవమానించాం... మమ్మల్ని క్షమించండంటూ వారు తిరుగుతున్నారన్నారు. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్లుగా వారి వైఖరి ఉందన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ బొక్క బోర్లా పడటం వల్లే బయటకు రావడం లేదన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉండి దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదు... పేదలకు డబుల్ బెడ్రూం ఇవ్వలేదు.. ఇంటికో ఉద్యోగం ఇవ్వలేదు.. మైనార్టీలకు 12 శాతం, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ ఇవ్వలేదని విమర్శించారు. ఒక్క హామీ నెరవేర్చని బీఆర్ఎస్‌కు మా గ్యారెంటీలపై ప్రశ్నించే అర్హత ఉందా? అన్నారు. మీలా మేం ఉద్యోగులకు వేతనాలు ఆపలేదన్నారు. ఫిబ్రవరి చివరి నాటికి రైతు భరోసా ద్వారా మీ ఖాతాలలోకి నగదు బదలీ చేసే బాధ్యతను కాంగ్రెస్ తీసుకుంటుందన్నారు.

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లికి వస్తున్నాను... కాసుకోండి అని ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు సవాలు విసిరారు. కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కార్యకర్తలు చెమటోడ్చి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని... పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించి ఢిల్లీలోనూ ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకువద్దామని పిలుపునిచ్చారు. నరేంద్రమోదీని ఓడించి రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాలన్నారు. కార్యకర్తల కష్టం వల్లే తాను ముఖ్యమంత్రినయ్యానన్నారు. తన పదవి, హోదా కాంగ్రెస్ కార్యకర్తలు ఇచ్చినవే అన్నారు.

**ఫిబ్రవరిలో మరో రెండు హామీలు**

అధికారంలోకి వచ్చి 50 రోజులు కూడా కాలేదని... కానీ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మన హామీలపై అసహనం వ్యక్తం చేస్తున్నాయన్నారు. హామీలపై అప్పుడే బిల్లా, రంగాలు ప్రశ్నిస్తున్నారని చురక అంటించారు. ఫిబ్రవరి నెలలో మరో రెండు హామీలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో మనం 14 స్థానాల్లో విజయం సాధించాలన్నారు. ఇక నుంచి తాను రోజు విడిచి రోజు తెలంగాణలో పర్యటిస్తానని చెప్పారు. మన పోరాటంలో ఇది ఇంటర్వెల్ మాత్రమేనని.. ఇంటర్వెల్ తర్వాత నుంచి అసలు సినిమా ఉంటుందన్నారు.

కాంగ్రెస్‌లో ఇందిరమ్మ ఇంట్లో ఉండే వ్యక్తిని ఎమ్మెల్యేగా చేశామన్నారు. పేదవాళ్లు, దళితులు తమ పార్టీలో ఎమ్మెల్యేలు అయ్యారన్నారు. స్వయానా పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దళిత బిడ్డ అని గుర్తు చేశారు. కానీ బీఆర్ఎస్ పార్టీలో మాత్రం శాండ్, ల్యాండ్, మైన్, వైన్ అక్రమాలు చేసిన వారికే పదవులు అని ఆరోపించారు. గతంలో రాహుల్ గాంధీ పాదయాత్ర వల్ల మూడు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చామన్నారు.

**కాంగ్రెస్ నేతలపై అక్రమ కేసులు**

రాహుల్ గాంధీ మణిపూర్ నుంచి మహారాష్ట్రకు భారత్ జోడో పాదయాత్ర చేస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ పాదయాత్రకు మోదీ, కేడీలు అడుగడుగునా గతంలో అడ్డుపడ్డారని మండిపడ్డారు. దేశం కోసం నెహ్రూ కుటుంబం త్యాగం చేసిందని వ్యాఖ్యానించారు. రాజీవ్ గాంధీ యువతను రాజకీయాల్లో ప్రోత్సహించారన్నారు. ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించింది కాంగ్రెస్ పార్టీయేనని... బీజేపీ నేతలు ఏం త్యాగాలు చేశారో చెప్పాలని నిలదీశారు. ఈడీ, సీబీఐ కేసులతో సోనియా గాంధీ సహా కాంగ్రెస్ నేతలను ఇబ్బంది పెట్టారని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ నేతలపై అక్రమ కేసులు పెట్టిందని ఆరోపించారు. రేపటి ఎన్నికల్లో.. మోదీ వేరు... కేడీ వేరు కాదని.. రూపాలు మాత్రమే వేరు అని విమర్శించారు.

## అలా మాట్లాడే వాళ్లను చెప్పుతో కొట్టే రోజులొస్తాయ్

-మొదటి పేజి తరువాయి



నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లీస్ పార్టీని బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నాయంటూ కిషన్‌రెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై విచారణ చేయడంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన లేదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను దోపిడీ దొంగల పార్టీలుగా అభివర్ణించిన కిషన్‌రెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దోషులకు శిక్ష పడుతుందనే విశ్వాసం ప్రజలకు లేదన్నారు. బీఆర్ఎస్ అవినీతిని కాంగ్రెస్ బయటకు తీస్తుందని ఆశిస్తే అది భంగపడ్డట్లే అవుతుందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీ అగ్గిలాంటి పార్టీ. బీజేపీపై మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గరపెట్టుకోవాలని సూచిస్తున్నా. బీఆర్ఎస్-బీజేపీ ఒకటేనని, కాంగ్రెస్%--%బీజేపీ ఒక్కటేనని మాట్లాడే వాళ్లను చెప్పుతో కొట్టే రోజులు వస్తాయి. తాము ఏ పార్టీతో కలవాల్సిన అవసరం లేదు. హైదరాబాద్ పార్లమెంట్‌లో పోటీ చేయడం కోసం కాదు.. అసదుద్దీన్‌ను ఓడించడం కోసమే పనిచేయాలి. హైదరాబాద్‌లో ఉన్న ముస్లిం సోదరులు మజ్లీస్ పార్టీని ఓడించాలని చూస్తున్నారు. మజ్లీస్ పార్టీని వ్యతిరేకించే ప్రతిఒక్కరూ బీజేపీ వైపు రావాలి. లక్షమంది అసదుద్దీన్‌లు వచ్చినా... మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## కేటీఆర్ బుద్ధిగా ప్రతిపక్ష హోదాలో పనిచేసుకోవాలి: మంత్రి సీతక్క

**కుళ్లు రాజకీయాలు మానుకోవాలంటూ సీతక్క హితవు**

**ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని చూసి బీఆర్ఎస్ ఓర్వలేకపోతోందని ఆగ్రహం**

**కేటీఆర్ బుద్ధిగా పనిచేయకుంటే పదేపదే ప్రజాతిరస్కరణ తప్పదని వార్నింగ్**

**సర్పంచ్ ఎన్నికలు ఇప్పట్లో ఉండవని వెల్లడి**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తెలంగాణ మంత్రి సీతక్క మండిపడ్డారు. కేటీఆర్ విధ్వంస రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని సీతక్క తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం తరువాత మంత్రి మీడియాతో పలు విషయాలపై మాట్లాడారు. కేటీఆర్ బుద్ధిగా ప్రతిపక్ష హోదాలో పనిచేసుకోవాలని, లేకపోతే ప్రజలు వారిని ఎప్పటికీ తిరస్కరిస్తూనే ఉంటారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి అహంకారమే కారణమని అన్నారు. సర్పంచులకు చెల్లించాల్సిన 16 నెలల బిల్లులకు సంబంధించి రూ.1200 కోట్లను గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందని మంత్రి సీతక్క మండిపడ్డారు. సమయానికి సర్పంచుల బిల్లులు చెల్లించి ఉంటే ఇలాంటి పరిస్థితి ఉండేది కాదని అన్నారు. కేసీఆర్ ఎమ్మెల్యేగా గెలిచినా ఇప్పటివరకూ ప్రమాణ స్వీకారం చేయడం లేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని, కేటీఆర్‌కు కుళ్లు రాజకీయాలు ఎందుకని ప్రశ్నించారు. ఉద్యోగులకు ప్రతినెల 5 లోపు జీతాలు, పెన్షన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజల సంక్షేమం కోసమే నిధులు వెచ్చిస్తున్నట్టు మంత్రి సీతక్క తెలిపారు.

## దశాబ్ద కాలం తర్వాత డీఆర్‌సీ




-మొదటి పేజి తరువాయి

సమస్యలను ఆయన నోట్ చేసుకున్నారు. అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. శాఖాపరంగా సమగ్ర అవగాహన, సమాచారం లేనివారిపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. వచ్చే సమావేశానికైనా సమగ్ర సమాచారంతో రావాలని పలు శాఖల అధికారులను స్వల్పంగా మందలించారు. అధికారులు తమ విధులు, బాధ్యతలు విస్మరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ప్రభుత్వం మాదిరిగా వన్‌సైడ్ నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు.

**పరీక్షల్లో ఉత్తీర్ణతపై సమ్మతి లేఖ తప్పనిసరి**

త్వరలో జరగనున్న పదోతరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సంబంధించి ఉత్తీర్ణతపై సమ్మతి లేఖ తప్పనిసరి అని మంత్రి పొన్నం అధికారులను ఆదేశించారు. సంబంధిత హెచ్ఎం, టీచర్, వార్డెన్‌లను నుంచి సమ్మతి లేఖ తీసుకోవాలని, విద్యార్థులు ఉత్తీర్ణత సాధించకుంటే వారినే బాధ్యులు చేయాలని సూచించారు. ఇప్పటి నుంచే సంబంధిత అధికారులు పాఠశాలలపై పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. గురుకులాలు, బీసీ వెల్ఫేర్ హాస్టళ్ల లో సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు.

**పరిష్కారానికి హామీ..**

ప్రభుత్వ విభాగాల్లో పలు పలు సమస్యలు, పెండింగ్ పనులను అధికారులు మంత్రి దృష్టికి తీసుకురావడంతో.. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రెండు మోడ్రన్ ధోబీఘాట్ల పూర్తైనప్పటికీ న్యాయపరమైన సమస్యలు ఉండడంతో మిషన్లు తుప్పుపట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొనడంతో సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఉన్న తాధికారులను ఆదేశించారు బీసీ హాస్టళ్లు అధిక శాతం ప్రైవేట్ భవనల్లో ఉన్నాయని వాటి సొంత భవనాల నిర్మాణం, 6 హాస్పిటళ్ల నిర్మాణం కోసం గత ప్రభుత్వం జీఓ ఇచ్చిందని, నిధులు విడుదల చేయలేదని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

**అధునాతన చేపల మార్కెట్ ఏర్పాటు**

నగరంలో అధునాతన చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. చేపల మార్కెట్ లేకపోవడంతో వ్యాపారులు రోడ్లపై విక్రయిస్తున్నారని, ప్రత్యేకంగా మార్కెట్ ఏర్పాటు చేసి మత్స్యకారులు, వినియోగదారులకు సౌకర్యం కల్పిస్తామన్నారు. కూరగాయల మార్కెట్‌లను సైతం రెగ్యులరైజ్ చేస్తామన్నారు. పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు.

**కలెక్టరేట్‌కు కొత్త భవనాన్ని నిర్మిస్తాం..**

త్వరలో హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌కు నూతన భవన సముదాయాన్ని నిర్మిస్తామని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. విశాలమైన స్థలంలో ఎవరూ ఊహించని విధంగా భారీ సముదాయాన్ని నిర్మిస్తామన్నారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తామన్నారు. రేషన్ కార్డులు లేని వారికి సైతం కొత్తవి అందిస్తామని స్పష్టం చేశారు. 58, 59 జీఓకు సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

**ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్లు**

రాబోయే వేసవితో పాటు విద్య, వైద్యానికి సంబంధించి అత్యవసర పనుల కోసం ఒక్కో నియోజక వర్గానికి రూ.10 కోట్ల చొప్పున ఖర్చు చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. బుధవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన 'జిల్లా స్థాయి సమీక్ష సమావేశం' అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రజల అత్యవసర సమస్యల పరిష్కారం కోసం తన కోటా నిధులు కేటాయించినట్లు తెలిపారు. త్వరలో ఎమ్మెల్యే, ఎమెల్సీలు, ఎంపీలతో జిల్లా అభివృద్ధిపై సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు.

## హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణకు 14 రోజుల రిమాండ్

**బాలకృష్ణ ఇంటితో పాటు 16 ప్రదేశాల్లో సోదాలు**





**హైదరాబాద్:** హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణను ఏసీబీ కోర్టులో అధికారులు హాజరు పర్చారు. కాగా.. ఆయనకు కోర్టు 14రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. ఫిబ్రవరి 8వరకు రిమాండ్ ఉండనుంది. పోలీసులు ఆయన్ను చంచల్ గూడా జైలుకు తరలించారు. బాలకృష్ణ ఇంటితో పాటు 16 ప్రదేశాల్లో సోదాలు చేశామని ఏసీబీ అధికారులు తెలిపారు. నిందితుడు బాలకృష్ణపై 13 (1) (%ఎ%), 13(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. బాలకృష్ణ ఇంటితో పాటు, బంధువులు, సహచరుల ఇళ్లల్లో సోదాలు చేశామని పేర్కొన్నారు. బాలకృష్ణ ఇంట్లో రూ.99.60 లక్షలు నగదు సీజ్ చేశామని స్పష్టం చేశారు. 1988 గ్రాముల బంగారాన్ని సీజ్ చేశామని తెలిపారు. 6 కేజీల సిల్వర్ స?్వధీనం చేసుకున్నామని వెల్లడించారు. రూ.8.26 కోట్ల రూపాయల విలువైన ఆస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సీజ్ చేసిన ఆస్తుల విలువ మార్కెట్ వ్యాల్యూ లో ఇంకా ఎక్కువ ఉంటుందని అన్నారు. మిగిలిన బీనామీలపై విచారణ చేయాల్సి ఉందని తెలిపారు.

**బాధితుల ఆవేదన..**

ఏసీబీ అరెస్టుతో హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. పుప్పాలగూడ సర్వేనెంబర్ 447లో కోర్టు పరిధిలోని వివాదస్పద భూములకు అనుమతులు ఇచ్చారని సూర్యప్రకాష్ అనే బాధితుడు తెలిపాడు. తమకు కోర్టు డిక్రీ ఉన్నప్పటికీ హైకోర్టు ఆదేశాలను పక్కన పెట్టి పరిమీషన్ ఇచ్చాడని వెల్లడించాడు. రఘురామ్ ప్రదీప్ కన్స్ట్రక్షన్ కు హైరేస్ అపార్ట్ మెంట్స్ కు అనుమతులు ఇచ్చాడని పేర్కొన్నాడు. అక్రమ అనుమతులపై హైకోర్టుకు వెళ్తే కోర్టును తప్పుదోవ పట్టించి ఫేక్ అఫిడవిట్ వేశారని తెలిపాడు. ఆర్టీఏ ద్వారా సమాచారం అడిగితే ఇప్పటివరకు ఎలాంటి సమాదానం ఇవ్వకుండా దాటవేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ.400కోట్ల విలువైన 6.36 ఎకరాల భూమిలో అక్రమ పర్మిషన్ ఇచ్చాడని బాధితులు తెలిపాడు. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు ఉన్నారని గతంలో తమను బెదిరించారని తెలిపారు. సమగ్ర దర్యాప్తు జరిపి న్యాయం జరిపించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శివ బాలకృష్ణ హయాంలో జరిగిన అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరుతున్నారు.

# సంపాదకీయం

## స్వాతంత్ర్య శతాబ్దికి అభివృద్ధి భారత్

భారత్ స్వాతంత్ర్యం సాధించి 2047 నాటికి నూరు సంవత్సరాలు అవుతుంది. స్వాతంత్ర్యానంతరం మన దేశం ఎన్నో రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించినా ఇంకా అనేక రంగాలలో దిగుమతులపై ఆధారపడవలసి వస్తోంది. మన కంటే ఏడాది తర్వాత విముక్తి పొందిన చైనా ఆర్థిక, వాణిజ్య రంగాలలో ఎంతో పురోగతి సాధించి రాజకీయంగా కూడా అమెరికా వంటి అగ్రదేశంతో పోటీపడుతూ ప్రాబల్యాన్ని విస్తరించుకుంటున్నది. మన పాలకులు కూడా చైనాను అనతి కాలంలో అధిగమిస్తామని అంటున్నారు గానీ తయారీ రంగంలో దిగుమతులపై ఆధారపడకుండా స్వావలంబన సాధనకు చేస్తున్న ప్రయత్నాలు ఇంకా సఫలీకృతం కాలేదు. భారత్‌లో తయారీ అనే ఆకర్షణీయమైన నినాదం ఇస్తున్నా ఆశించిన పురోగతిలేదు. ఇప్పటికీ చైనా తదితర దేశాల నుండి ఎలెక్ట్రిక్, ఎలక్ట్రానిక్, యంత్రాలు, మందులు, ఔషధాల తయారీలో వాడే పరికరాలను, పదార్థాలను దిగుమతి చేసుకుంటూనే వున్నాము. జనవరి 26న మనం 75వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. ఈ పూర్వరంగంలో 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మలచాలనే సంకల్పాన్ని ఏలికలు వ్యక్తం చేశారు. సమున్నత లక్ష్యం అభినందనీయమే. అయితే అందుకు ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలలో ముఖ్యంగా వాణిజ్యం, సేద్యం, శాస్త్ర సాంకేతిక రంగాలలో అద్భుత ప్రగతిని సాధించవలసి ఉన్నది. మన ప్రభుత్వాలు, పాలకులకు దార్శనిక దృక్పథంతో ఆర్థిక, సామాజిక అభివృద్ధి, పర్యావరణ సుస్థిరత, సమ్మిళిత సుపరిపాలన అందించడం ఎంతో ముఖ్యం. దేశ ప్రజలకు ముఖ్యంగా మహిళలు, బాలబాలికలకు సరైన పోషకాహారం, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన విద్యను అందించడం, నమ్మకమైన ఆరోగ్య సంరక్షణను కల్పించాల్సి ఉంది. పేదలు, మహిళలు, యువత, రైతులే పేద కులాలని, వారి అభ్యున్నతే లక్ష్యమని ప్రధాని నరేంద్ర మోడీ తరచూ వక్కాణిస్తుంటారు. అయితే వీరు గౌరవప్రదంగా జీవించగలిగే పరిస్థితులు ఉన్నాయా అనేదే ప్రశ్న. తన పదేళ్ల పాలనలో దేశంలో 25 కోట్ల మంది దారిద్ర్యరేఖను అధిగమించి మెరుగైన జీవితాలు గడుతున్నారని ప్రధాని మోడీ ప్రకటించారు. నీతిఆయోగ్ కూడా 24.82 కోట్ల మంది ప్రజలు దుర్భర జీవితాల నుండి మెరుగైన జీవిత ప్రమాణాలను సాధించినట్లు నీతిఆయోగ్ కూడా ధ్రువీకరించింది. జాతీయ బహువిధ దారిద్ర్య సూచిక, ఎన్ఎంపిఐ ఆధారంగా ఈ గణన జరిగింది. యుయుఎన్‌డిపి దారిద్ర్య గణనలో ప్రజారోగ్యం, పౌష్టికాహారం, శిశు మరణాలు, విద్య, పాఠశాల ఎన్నేళ్ళు చదివారు, హాజరు ఎలా వున్నది? వంటగ్యాస్, పారిశుధ్యం, మంచినీరు, గృహవసతి, ఆస్తుల వంటి జీవన ప్రమాణాల ఆధారంగా వారు దారిద్ర్య రేఖను దాటారా లేదా అని నిర్ధారిస్తారు. నీతిఆయోగ్ బహుముఖ దారిద్ర్య సూచికల ఎన్ఎంపిఐ మేరకు తల్లుల ఆరోగ్యం, వారికి బ్యాంకు ఖాతాలున్నాయా లేదా అనే మరో రెండు అంశాలను చేర్చి, 12 అంశాల ప్రాతిపదికగా దారిద్ర్యాన్ని గణిస్తారు. సంప్రదాయకంగా గృహస్థుల ఆదాయం, వినియోగం ప్రాతిపదికగా జరిగే దారిద్ర్య గణన కంటే ఎన్ఎంపిఐ పద్ధతి మెరుగైనదని నీతిఆయోగ్ భావిస్తున్నది. ఆదాయం, వినియోగం ప్రాతిపదిక కంటే ఈ 12 సూచికల ఆధారంగా దారిద్ర్యాన్ని మదింపు పద్ధతి అనేది విస్తృత ప్రజా బాహళ్యపు స్థితిగతులను మెరుగుపరచగలిగితే అదే పద్ధతి మేలనే అభిప్రాయాలున్నాయి. ఇది ప్రధానంగా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి చేసే ఖర్చు లేదా పెట్టుబడిపై ఆధారపడి వుంటుంది. అయితే కుటుంబాల ఆదాయం ఎంత అనేదీ ముఖ్యమైనదే. మరుగుదొడ్ల వంటి పారిశుద్ధ్య సౌకర్యాలు, పిల్లలు పాఠశాలలకు వెళ్ళడం, ఆ కుటుంబాలకు బ్యాంకు ఖాతా ఉండటమూ ముఖ్యమే. నాణ్యమైన విద్యాసౌకర్యాలు లేకుంటే పిల్లలను పాఠశాలలకు పంపడం వల్ల ఆశించిన లక్ష్యం నెరవేరదు. నాణ్యత లేని విద్యా వ్యవస్థ నిరుద్యోగుల సంఖ్య పెంచుతుందే తప్ప ప్రయోజనం లేదు. అల్పాదాయ వర్గాలకు బతుకే కష్టమైనప్పుడు పొదుపు చేయగల మిగులు ఆదాయం లేకుండా బ్యాంకు ఖాతాలు ఉన్నా ఉపయోగం లేదు. కాగా విద్య, ఆరోగ్యం, వంటగ్యాస్ వంటి సౌకర్యాల కల్పన ద్వారా అమలు చేసే అభివృద్ధి నమూనా వల్ల ప్రజల ఆదాయాలు, జీవన నాణ్యత మెరుగుపడుతుందా అనేది మరో అంశం. ప్రజల ఆదాయ స్థాయిలను బట్టి దారిద్ర్య స్థాయిని లెక్కించే పద్ధతి బదులు దారిద్ర్యరేఖను అధిగమించిన వారి సంఖ్యను ఎక్కువ చేసి చూపడానికే ప్రభుత్వమే ఎన్ఎంపిఐ పద్ధతిని తీసుకొచ్చిందనే విమర్శలు గమనార్హం. కుటుంబాలకు దారిద్ర్యరేఖను అధిగమించడానికి అవసరమైన ఆదాయమూ, దేశంలో తీవ్రంగా ఉన్న నిరుద్యోగ సమస్య తీరినపుడే, కార్మికులు, ఉద్యోగుల నిజ వేతన స్థాయిలను పరిగణనలోకి తీసుకుని ప్రజల సాధకబాధకాలను పరిష్కరించినపుడే, ప్రజల ఆర్థిక, సామాజిక, బౌద్ధిక స్థాయిలు మెరుగైనపుడే, జీవన నాణ్యతలు మెరుగుపడినపుడే, అంతర్జాతీయ స్థాయిలో మన యువత పోటీలో నిలిచి అందరికన్నా మిన్నగా ప్రతిభా సామర్థ్యాలను ప్రదర్శించినపుడే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగగలుగుతుంది. ప్రజల నిజ ఆదాయాలు పెరిగినపుడే అది సాధ్యం. భారత్‌లో ఇప్పటికీ దారిద్ర్యరేఖకు దిగువన దుర్భర జీవితం గడుపుతున్న వారి సంఖ్య 16 కోట్ల వరకు ఉన్నట్లు ప్రపంచ బ్యాంకు అంచనా. 2017 నాటికి దేశంలో తలసరి ఆదాయం 2.15 డాలర్లుగా ఉన్నవారి కొనుగోలు శక్తి ప్రాతిపదికగా తీసుకుని ప్రపంచ బ్యాంకు ఈ నిర్ధారణకు వచ్చింది. వీరంతా ఆదాయ, వినియోగాలను బట్టి గాని లేదా ఎన్ఎంపిఐ ప్రాతిపదికగా ఏతీరున లెక్కించినా దారిద్ర్యం నుండి బయటపడినప్పుడే భారత్‌లో రామరాజ్యం వచ్చిందనుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఈ పేదల్లో అత్యధికులు పల్లెల్లో ఉంటూ సేద్యం, వ్యవసాయేతర పనుల ద్వారా కుటుంబ పోషణ చేసుకుంటున్నారు. అధికారం నెరపిన యుపిఎ, ఎన్‌డిఎ ప్రభుత్వాల హయాంలో ఈ పేదల స్థితిగతులు మెరుగుపడ్డాయా అని పరిశీలించాల్సి వుంది. 2004 నుండి 2009 వరకు దేశాన్ని ఏలిన యుపిఎ 1 ప్రభుత్వ హయాంలో కూలీ ఏటా 0.2 % పెరగ్గా, వ్యవసాయేతర వేతనాలు 0.9% తగ్గినట్లు ఆర్థిక నిపుణుల అంచనా. కాగా యుపిఎ 2 ప్రభుత్వం అధికారంలో ఉన్న 2009- 14 కాలంలో వ్యవసాయ వేతనాలు 8.6 %, వ్యవసాయేతర వేతనాలు 6.9% పెరిగినట్లు అధ్యయనాల్లో వెల్లడైంది. నరేంద్ర మోడీ నాయకత్వంలో అధికారానికి వచ్చిన ఎన్‌డిఎ 1 కాలంలో 2014 19 మధ్య ఏటా వ్యవసాయేతర వేతనాలు 3% తగ్గినట్లు తేలింది. ఎన్‌డిఎ 2 హయాంలో 2019- 24 మధ్య సేద్యపురంగ నిజ వేతనాలు 0.6%, గ్రామీణ వ్యవసాయేతర వేతనాలు కరోనా మహమ్మారి ప్రబలిన కారణంగా 1.4 శాతం తగ్గినట్లు వెల్లడైంది. మన దేశంలో 1951 నాటికి దాదాపు 70% మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవించేవారు. 2011 నాటికి వ్యవసాయంపై ఆధారపడి జీవించే వారి సంఖ్య 55 శాతానికి తగ్గినట్లు గణాంకాలు ఘోషిస్తున్నాయి. అయితే సేద్యంపై ఆధారపడి బతికే వారి సంఖ్య 2019 నాటికి 42.5 శాతానికి తగ్గడం గమనార్హం. అయితే 2019- 20లలో దేశంలో కరోనా మహమ్మారి ప్రబలి లాక్‌డౌన్లు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థల మూసివేత వల్ల నగరాలు, పట్టణాలలో పని చేస్తున్న లక్షలాది మంది వలస కార్మికులు బతికే దారి కానక మండుటెండల్లో కాలి నడకన పల్లెబాట పట్టారు. ఆ సంక్లిష్ట సమయంలో వారికి పని కల్పించి పొట్ట పోసుకోవడానికి ఆస్కారమిచ్చి నీడ కల్పించింది వ్యవసాయ రంగమే. ఈ సంవత్సరాలలో మళ్లీ సేద్యపు రంగంపై ఆధారపడి జీవించే వారి సంఖ్య 2019లో 45.6 శాతానికి, 2020లో 46.5 శాతానికి పెరిగింది. 2021లో వారి సంఖ్య 45.5 శాతానికి తగ్గింది. ఎన్‌డిఎ 2 హయాంలో పల్లెల్లో కూలీల లభ్యత పెరిగినందున నిజ వేతనాలు తగ్గాయని అంచనా. యుపిఎ ప్రభుత్వ పదేళ్ల పాలనలో నిరుద్యోగిత రేటు 8.4%, ప్రధాని నరేంద్ర మోడీ పదేళ్ల పాలనలో 7.9 శాతం ఉన్నట్లు అంతర్జాతీయ కార్మిక సంస్థ గణాంకాలను బట్టి తెలుస్తోంది.

# భారత జాతీయ పతాక నేపథ్యం



భారత జాతీయ పతాకం, దీర్ఘ చతురస్రాకారంలో కాషాయం, తెలుపు, పచ్చ రంగులు సమ నిష్పత్తిలో త్రివర్ణంగా ఉంటూ మధ్యలో 24 ఆకులు కలిగిన నేవీ బ్లూ రంగులో ఉండే చక్రమైన అశోక చక్రంతో ఉంటుంది. 1947 జూలై 22న భారత రాజ్యాంగ పరిషత్ సమావేశంలో ప్రస్తుతం ఉన్న రూపంలో ఆమోదం పొంది, 1947 ఆగస్టు 15న భారత డొమినియన్‌కు అధికారిక పతాకంగా ఆమోదం పొందింది. తర్వాత క్రమేపీ భారత గణతంత్రానికి అధికారిక పతాకంగా స్వీకరించారు. 1951లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బి.ఐ.ఎస్.) జాతీయ పతాకానికి కొన్ని నిర్దేశకాలను రూపొందించింది. ఈ నిర్దేశకాలను మన దేశంలో అమల్లోకి వచ్చిన మెట్రిక్ మానానికి సరిపోయేటట్లు 1964లో ఒకసారి, 1968 ఆగష్టు 17న మరొక సారి సవరించారు. పతాక పరిమాణం, రంగులు, వాడే బట్టకు వర్తించే ఈ నిర్దేశకాలు చాలా కచ్చితమైనవి. వీటి ఉల్లంఘన శిక్షార్హమైన నేరం. పతాక కొలతలు మి.మీ. లలో...6300 ఐ 4200, 3600 ఐ 2400, 2700 ఐ 1800, 1800 ఐ 1200, 1350 ఐ 900, 900 ఐ 600, 450 ఐ 300, 225 ఐ 150, 150 ఐ 100గా నిర్ణయించారు. పతాకం తయారీలో ఖాదీ లేక చేనేత వస్త్రాన్ని మాత్రమే వాడాలి.


ఖాదీలో నూలు, పట్టు, ఉన్ని బట్టలను మాత్రమే వాడుతారు. జెండాలో రెండు రకాల ఖాదీని వాడుతారు: జెండా రూపానికి ఖాదీ-బంటింగ్, జెండాను కఱ్ఱకు తగిలించడానికి అవసరమయ్యే బట్టకు ఖాదీ-డక్. ఖాదీ-డక్ ప్రత్యేకమైన ఎవఱస్త్రవ (పసుపు పచ్చ-బ్రౌన్ కలిసిన రంగు) రంగులో ఉంటుంది. సాంప్రదాయిక నేతలో రెండు పోగులను వాడేచోట ఖాదీ-డక్ లో మూడు పోగులను వాడుతారు. ఇది చాలా అరుదైన నేత. దేశం మొత్తమ్మీద ఈ రకమైన నేతపని తెలిసినవాళ్ళు పదిమంది కంటే ఎక్కువ లేరు. ఇంకా చదరపు సెంటీ మీటరుకు కచ్చితంగా 150 పోగులు ఉండాలని, కుట్టుకు నాలుగు పోగులు ఉండాలని, ఒక చదరపు అడుగు గుడ్డ కచ్చితంగా 205 గ్రాములుండాలని నిర్దేశకాలు ఉన్నాయి. జాతీయపతాకాలను ఉత్పత్తిచేయడానికి అవసరమైన ఖాదీ బట్ట ఉత్తర కర్ణాటకలోని ధార్వాడ్, బాగల్కోట్ జిల్లాల్లోని రెండు చేనేత యూనిట్ల నుంచి వస్తుంది. ప్రస్తుతం దేశంలో జాతీయ పతాకాలను తయారు చేయడానికి ప్రభుత్వ అనుమతి గల ఒకే ఒక్క సంస్థ హుబ్లీలో ఉంది. జాతీయ పతాకాలను ఉత్పత్తి చేయడానికి అనుమతి ఇచ్చే అధికారం ఖాదీ డెవలప్‌మెంట్ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ కు ఉన్నప్పటికీ ఆ అనుమతిని రద్దు చేసే అధికారం బి.ఐ.ఎస్.కు ఉంది.

నేసిన బట్టను పరీక్ష నిమిత్తం బి.ఐ.ఎస్.కు పంపిస్తారు. తిరిగొచ్చిన తర్వాత బ్లీచింగు చేసి రంగులద్ది, మధ్యలో అశోకచక్రాన్ని స్క్రీన్ ప్రింటింగు గానీ, స్టెన్సిల్ గానీ, ఎంబ్రాయిడరీ గానీ చేస్తారు. చక్రం రెండు వైపులా ఒకేచోట స్పష్టంగా కనిపించాలి. జెండాపై వేసిన రంగులను బి.ఐ.ఎస్. పరీక్షించిన తర్వాతే పతాకాలను అమ్మటానికి అనుమతిస్తారు. మన దేశంలో ప్రతి సంవత్సరం దాదాపు నాలుగు కోట్ల జెండాలు అమ్ముడు పోతాయి. దేశంలోనే అతిపెద్ద పతాకం (6.3 ఐ 4.2 మీ) మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యాలయమైన మంత్రాలయ భవనం మీద ఎగురుతుంది. 2002కు ముందు జాతీయ సెలవు దినాల్లో తప్ప మిగతా సమయాల్లో జాతీయ పతాకాన్ని ప్రజలు ఎగరేయడానికి అనుమతించేవారు కాదు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు మాత్రమే ఆ అధికారముండేది. ఈ నిబంధనను తొలగించాలని కోరుతూ నవీన్ జిందాల్ అనే పారిశ్రామికవేత్త ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశాడు. జిందాల్ తన కార్యాలయ భవంతి మీద జాతీయ పతాకాన్ని ఎగురవేయగా అధికారులు దాన్ని స్వాధీనం చేసుకుని, ఆయన్ను ప్రాసిక్యూట్ చేస్తామని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా జాతీయ పతాకాన్ని ఎగరేయడం పౌరుడిగా తన హక్కని, దేశం పట్ల తన ప్రేమను ప్రకటించుకునే మార్గమని జిందాల్ వాదించాడు. ఆ కేసు సుప్రీమ్ కోర్టుకు వెళ్ళింది. సుప్రీమ్‌కోర్టు ఈ విషయాన్ని పరిశీలించడానికి ఒక కమిటీని వేయమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. కేంద్ర మంత్రిమండలి పతాకం గౌరవానికి భంగం కలగని రీతిలో ఎవరైనా జాతీయ పతాకాన్ని ఎగరేయవచ్చని అనుమతిస్తూ జాతీయపతాక నియమావళిని సవరించింది.

భారత జెండా కోడ్, జాతీయ చిహ్నాలకు సంబంధించిన ఇతర చట్టాలు జెండా వాడుకకు వర్తిస్తాయి. మొదట్లో ఈ కోడ్ భారత స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ దినోత్సవాల సందర్భంగా తప్ప మిగతా రోజుల్లో సాధారణ పౌరులు జెండాను వాడడం నిషేధించింది. 2002లో నవీన్ జిందాల్ అభ్యర్థన పరిశీలిస్తూ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సాధారణ పౌరులు జెండాను వాడుకునేందుకు వీలుగా కోడ్‌ను సవరించమని భారత ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దాన్ని అనుసరించి భారతీయ కేంద్ర మంత్రివర్గం కోడ్‌ను పరిమితంగా వాడేందుకు సాధారణ పౌరులకు వీలునిస్తూ సవరించింది. 2005లో మరోసారి కోడ్‌ను సవరించి కొన్ని రకాల దుస్తుల మీద ఉపయోగించడం సహా మరికొన్ని అదనపు వాడుకలను అనుమతించారు. జెండాను ఎగురవేయడం, ఇతర జాతీయ, సాధారణ జెండాలతో కలిపి భారత జాతీయ పతాకాన్ని వాడేప్పుడు అనుసరించాల్సిన విధానాలకు ఆ కోడ్ వర్తిస్తుంది. ఈ సవరణ 2002 జనవరి 26 న అమల్లోకి వచ్చింది. జాతీయపతాక నియమావళి అనేది చట్టం కానప్పటికీ, ఆ నియమావళి లోని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సుప్రీమ్‌కోర్టు యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ నవీన్ జిందాల్ కేసులో పేర్కొంది.

జాతీయ పతాకాన్ని ఎగరేసే హక్కు సంపూర్ణ హక్కు కాదు. పరిమితులతో కూడిన హక్కు. దీన్ని భారతరాజ్యాంగంలోని 51ఎ ఆర్టికల్ లోని ప్రాథమిక విధులతో కలిపి అన్వయించ వలసి ఉంటుంది. వాస్తవంగా జెండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కూడా యూనిఫారాలు, బట్టలు, ఇతర వస్త్రాలపై జెండా వినియోగాన్ని ఒప్పుకోదు. జూలై 2005 లో, భారతదేశం ప్రభుత్వం కొన్ని రకాల వినియోగాన్ని అనుమతించటానికి సవరించారు. సవరించిన కోడ్ ప్రకారంలో దుస్తులలో జెండా వాడుక నిషేధిస్తుంది. పిల్లో కవర్స్, చేతి రుమాలు లేదా ఇతర వస్త్రాలు పై ఎంబ్రాయిడరీ డిజైన్స్ నిషేధిస్తుంది. దెబ్బతిన్న జెండాలు లేదా పాడయి పోయిన జండాలు నాశనము చేయడానికి ఒక ప్రత్యేక పద్ధతి ఉంది. పాడయిన లేదా చిరిగి పోయిన జెండాలను పక్కన పడెయ్యటం లేదా అగౌరవంగా నాశనం చేయకూడదు. అలాంటి వాటిని కాల్చడము /తగులబెట్టడం లేదా భూమిలో పాతిపెట్టడం చేయాలి. లేదా జెండా గౌరవాన్ని కాపాడే మరే ఇతర పద్ధతి ద్వారా మాత్రమే వాటిని నాశనము చేయాలి. భారతీయులు సగర్వంగా, సగౌరవంగా తలెత్తి వందనం చేసే, భారత సార్వభౌమాధికారానికి ప్రతీక అయిన త్రివర్ణ పతాక రూపకర్త బహుముఖ ప్రజ్ఞ కలిగిన పింగళి వెంకయ్యను భారతీయులంతా గుర్తు చేసుకోవాల్సిన సందర్భం.

# నిజాం పాలనలో తొలి హిందూ పోలీస్ కమిషనర్ పింగళి



పింగళి వెంకట రామారెడ్డి. నేటి తరానికి చెందిన చాలా మందికి ఎక్కువగా అపరిచితమైన పేరు. భాగ్యనగరం చిత్రపటంపై చెరగని సంతకం ఆయనది. నిజాం ప్రభువుకు విశ్వాస పాత్రులై, హైదరాబాద్ నగరంపై తనదయిన ముద్ర వేసుకుని, ప్రజలకు అనేక రంగాలలో సహాయ సహకారాలు అందించి ప్రజా శ్రేయస్సే ఏకైక లక్ష్యంగా, అంకిత భావంతో సేవచేసి అపారమైన ప్రేమాభి మానలను చూరగొన్న ప్రజాబంధువు ఆయన. నిజాం రాజుల ఏడు తరాల రాజ్య పాలనలో హైదరాబాదు నగర పోలీసు కమీషనర్ (కొత్వాల్) పదవికి నియమితులైన ప్రప్రథమ హిందువుగా చరిత్రలో మిగిలి పోయారాయన. వెంకట రామారెడ్డి (ఆగష్టు 22, 1869 – జనవరి 25, 1953) నిజాం పరిపాలనలో పోలీసు ఉన్నతాధికారి. నిజాం ప్రభువు వద్ద తమకు గల పలుకుబడి వల్ల ఎన్నో సంస్థలను స్థాపించారు. ఎన్నింటికో సాయం అందించారు. విద్యా వ్యాప్తికి ఎనలేని కృషి చేశారు. హైదరాబాద్ లో రెడ్డి హాస్టల్ నెలకొల్పారు.

ఆయన1869, ఆగష్టు 22 న వనపర్తి జిల్లా కొత్త కొండ మండలం ఒక చిన్న గ్రామంలో జన్మించాడు. తల్లిదండ్రులు కేశవరావు, జారమ్మ. ఆయన పుట్టగానే కొద్ది సమయం లోనే తల్లి మరణించగా, తొమ్మిది సంవత్సరాల పాటు రాయణి పేటలో అమ్మమ్మ కిష్టమ్మ చెంత పోషణలో పెరిగారు. చిన్నప్పుడు ఖాన్గీ (ప్రైవేటు) బడిలో భారత, భాగవతాలు చదివారు. తరువాత నాలుగు సంవత్సరాలు వనపర్తి పాఠశాలలో ఉర్దూ, ఫార్సీభాషను చదువు కున్నారు. తరువాత విలియం వాహబ్ దగ్గర కన్నడ, మరాఠీ భాషలు నేర్చుకున్నారు. నజర్ మహమ్మద్ సహాయంతో 1886లో ముదిగ్గు ఠాణాకు అమీను (సబ్ ఇన్స్‌పెక్టర్) గా నియమితులైనారు. తరువాత నిజాం సొంత ఎస్టేటు వ్యవహారాలలో ప్రత్యేక అధికారిగా కొంత కాలం వ్యవహరించారు. నిజాయితీ, సమర్థత, విధుల నిర్వహణలో చాకచక్యం కారణంగా అనతికాలంలో పదోన్నతి లభించింది. మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్, గుల్బర్గా, అత్రాఫ్ బల్దా (రంగారెడ్డి) జిల్లాలో పోలీసు అధికారిగా విధులు నిర్వహించారు. ఆ తరువాత ఆయన రాజధాని నగరం హైదరాబాద్‌లో నాయెబ్ కొత్వాల్‌గా నియమితులైనారు. అనంతరం కొత్వాల్ (సిటీ పోలీస్ కమిషనర్) అయ్యారు. వేల్సు యువరాజు హైదరాబాదు వచ్చినప్పుడు గట్టి భద్రతా ఏర్పాట్లుచేసి గుర్తింపు పొందారు. 1933 ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు. వెంకట రామారెడ్డి ఎన్నో సంస్థలను పోషించారు. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం వేమనాంధ్ర భాషా నిలయం, బాల సరస్వతి గ్రంథాలయం పురోభివృద్ధికి సహాయం అందించారు. 1946లో జరిగిన 26వ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించారు. హైదరాబాదులో రెడ్డి విద్యార్థి వసతిగృహం నెలకొల్పారు. తెలంగాణలో విద్యావ్యాప్తిలోనూ, రాజకీయ చైతన్యం నింపడం లోనూ రెడ్డి హాస్టల్ కీలక పాత్ర పోషించింది. హాస్టల్‌ను ప్రారంభించేందుకు గద్వాల మహారాణి, వనపర్తి రాజా, పింగళి కోదండరాం రెడ్డి, గోపాలు పేట, దోమకొండ రాజా, జటప్రోలు రాజా తదతరుల నుంచి దాదాపు లక్ష రూపాయల వరకు చందాలు పోగు చేశారు. తొలుత నగరంలో అద్దె ఇంట్లో రెడ్డి హాస్టల్‌ను ప్రారంభించారు. తర్వాత 1918లో ప్రస్తుతం అబిడ్స్‌లో ఉన్న రెడ్డి హాస్టల్ సొంత భవనంలోకి మారింది.

మాతృభాషపట్ల జరుగుతున్న నిరాదరణను చూడలేక, 26 మే 1943 బుధవారం రెడ్డి హాస్టల్ గ్రంథాలయంలో నాటి ప్రముఖ పండితులు, భాషాభిమానులు, కవులు, రచయితలు సమావేశం నిర్వహించిన ఫలితంగా తెలుగు భాషా సంస్కృతుల ప్రచారం ప్రధాన లక్ష్యంగా ఒక సంస్థను స్థాపించాలని చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. సంస్థకు 'నిజాం రాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తు' అని పేరు పెట్టారు. పరిషత్తు ద్వితీయ మహాసభ ఓరుగల్లులో 1944 డిసెంబర్ 28, 29, 30 తేదీల్లో వైభవంగా జరగగా, ఉదయ రాజు రాజేశ్వరరావు ఆహ్వాన సంఘానికి అధ్యక్షులు కాగా, కాళోజీ నారాయణరావు కార్యదర్శిగా, మహాసభను రాజాబహద్దూర్ వెంకట రామారెడ్డి ప్రారంభించారు. సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించారు. 1946 మార్చి 15, 16, 17 తేదీల్లో తృతీయ మహాసభలు జరిగాయి. లోకనంది శంకరనారాయణ రావు సభలకు అధ్యక్షత వహించారు. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి సభలను ప్రారంభించారు. నారాయణ గూడ ఆంధ్ర బాలికోన్నత పాఠశాలకు చాలా కాలం అధ్యక్షులుగా పనిచేశారు. ఆంధ్ర విద్యాలయ కార్యవర్గానికి మరణించే వరకు అధ్యక్షులుగా ఉన్నారు. 1926లో "గోలకొండ పత్రిక" స్థాపనకు ముఖ్య కారకులయ్యారు. ఆ కాలంలో ఆయన వలన సహాయం పొందని తెలుగు సంస్థ లేదంటే అతిశయోక్తి కాదు. హరిజనోద్ధరణకు ఏర్పడిన సంఘాలకు, అనాథ బాలల ఆశ్రమాలు, కుష్టు నివారణ సంఘం జంతు హింసా నివారణ సమితి వంటి సంస్థలతో పనిచేసి, వాటికి ఉదారంగా ధన సహాయం చేశారు.

ఈ క్రమంలోనే 1933లో రెడ్డి బాలికల హాస్టల్ (నారాయణ గూడ), 1954లో రెడ్డి మహిళా కళాశాల (నారాయణగూడ) లను ప్రారంభించారు. పింగళి సేవలకు గుర్తింపుగా నిజాం రాజు జన్మదినోత్సవం సందర్భంగా 1921లో "రాజా బహద్దూర్" అనే గౌరవం ఇచ్చారు. బ్రిటిష్ ప్రభుత్వం 1931లో ఆయనకు "ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్" గౌరవం ప్రదానం చేశారు. వెంకట రామారెడ్డి కాంస్య విగ్రహం హైదరాబాదులో నారాయణగూడ చౌరస్తాలో ప్రతిష్ఠించారు. వెంకట రామారెడ్డి పేరుతో హైదరాబాద్‌లో ఒక మహిళా కళాశాల స్థాపితమైంది. ఆయన పేరు మీద ట్రస్టును ఏర్పాటుచేసి, ఆ ట్రస్ట్ ద్వారా హైదరాబాద్, సైబరాబాద్ మూడు కమిషనరేట్ల పరిధిలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు విధుల్లో ప్రతిభ కనబర్చిన వారికి రాజాబహద్దూర్ వెంకట రామారెడ్డి అవార్డును అందజేస్తున్నారు. పధ్నాలుగు సంవత్సరాలు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌గా పనిచేసి, గ్రామీణ విద్యార్థుల చదువు కోసం రెడ్డి హాస్టల్ స్థాపించి, ఎందరో తెలుగువారు వెలుగులోకి రావడానికి కారకుడైన మహానుభావుడు కొత్వాల్ వెంకటరామారెడ్డి జనవరి 25 తేదీన 1953 సంవత్సరంలో పరమ పదించారు. లోయర్ ట్యాంక్ బండ్ లోని దోమలగుడ ప్రాంతంలో ఆయన సమాధి ఉంది.

## 28న ఎస్సారార్ కాలేజీలో వేలాది మంది బీజేపీ కార్యకర్తల సమ్మేళనం

**కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాక?**

**సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బండి సంజయ్ పిలుపు**



కరీంనగర్ : ఈనెల 28న ఎస్సారార్ కళాశాల మైదానంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వేలాది మంది కార్యకర్తలతో సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరయ్యే ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఒక్కో పోలింగ్ బూత్ నుండి 20 మంది కార్యకర్తలను ఆహ్వానిస్తున్నామని? పార్లమెంట్ వ్యాపంగా వేలాది మంది కార్యకర్తలు హాజరు కాబోతున్నారని తెలిపారు. ఈ సమ్మేళనానికి వచ్చే కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈరోజు సాయంత్రం కరీంనగర్ లోని అశోక్ నగర్ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద కరీంనగర్ టౌన్ ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. అమిత్ షా రాక సందర్భంగా కార్యకర్తల సమ్మేళనానికి చేయాల్సిన ఏర్పాట్లు, రవాణ, ఇతరత్రా సదుపాయాల కల్పనపై చర్చించారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ?"కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాక సందర్భంగా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయండి. నగరాన్ని కాషాయ మయం చేయండి. ఎక్కడికక్కడ అమిత్ షా కు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయండి."అని కోరారు. "కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 2 వేలకు పైగా పోలింగ్ బూత్ లు ఉన్నాయి. ఒక్కో బూత్ నుండి 20 మంది చొప్పున 40 వేల మంది క్రియాశీల కార్యకర్తలను ఈ సమ్మేళనానికి ఆహ్వానిస్తున్నాం. వారంతా సమ్మేళనానికి వచ్చే విధంగా రవాణా ఏర్పాట్లు చేయండి. భోజన, తాగునీటి సదుపాయాలకు ఇబ్బంది లేకుండా చూడాలి. అమిత్ షా వేలాది మంది కార్యకర్తలను ఉద్దేశించి పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరిస్తారు. ప్రతి ఒక్కరూ 28న నిర్ణీత సమాయానికి సమ్మేళనానికి హాజరై విజయవంతం చేయాలి"అని కోరారు.

## సొంత చెల్లెలిని చంపేసిన అన్న




**కర్ణాటక :** ఇతర మతానికి చెందిన యువకుడిని ప్రేమించిందన్న అక్కసుతో సొంత చెల్లెలినే కడతేర్చాడో అన్న. దీంతో కోపోద్రిక్తుడైన అన్న చెల్లిని చెరువులోకి తోచి చంపేందుకు యత్నించాడు. గమనించిన తల్లి బిడ్డను కాపాడుకునేందుకు తాను కూడా చెరువులోకి దూకింది. ఈక్రమంలో తల్లీకూతుళ్లు మృత్యువాత పడ్డారు. ఈ దారుణ సంఘటన కర్ణాటకలోని మైసూరు జిల్లా హుణసూరు తాలూకా మరూరు గ్రామంలో జరిగింది.మైసూరు జిల్లా హుణసూరు తాలూకా మరూరు గ్రామానికి చెందిన సతీశ్, అనిత(43) దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు నితిన్, ధను శ్రీ. నితిన్ కూలి పనులకు వెళ్తుండగా.. ధను శ్రీ(19) బీకాం రెండో సంవత్సరం చదువుతోంది. ఈక్రమంలో మారూరుకు పొరుగున ఉన్న హనగోడు గ్రామానికి చెందిన ఇతర మతస్తుడైన ఓయువకుడిని ధనుశ్రీ ప్రేమిస్తోంది. తాజాగా బుర్ఖా ధరించి ప్రేమించిన వ్యక్తితో రోడ్డుపై కనిపించింది. దీంతో నితిన్ తరుచూ ధనుశ్రీతో గొడవ పడేవాడు. అతనితో స్నేహం మానుకోవాలంటూ పలుమార్లు హెచ్చరించాడు. సోదరుడు హెచ్చరించినప్పటికీ ధనుశ్రీ ఆ వ్యక్తితో ప్రేమ వ్యవహారం కొనసాగించినట్లు సమాచారం. దీంతో చెల్లిని ఎలాగైనా చంపాలని అన్న నితిన్ భావించాడు. ఈ క్రమంలో బంధువులకు బాగా లేదంటూ నితిన్ తన బైక్‌పై తన సోదరి ధనుశ్రీని, తల్లి అనితను బయటకు తీసుకెళ్లాడు. ఊరి బయట ఉన్న చెరువు వద్ద ధనుశ్రీ ప్రేమ విషయమై వారి మధ్య మరోమారు గొడవ జరిగింది. పట్టరాని కోపంతో నితిన్ తన చెల్లి చేతులను టవల్‌తో కట్టేసి హున్‌సూర్‌కు సమీపంలోని మరూర్ సమీపంలో ఉన్న చెరువులోకి చెల్లి ధనుశ్రీని నెట్టాడు. కుమార్తెను కాపాడుకునేందుకు తల్లి అనిత కూడా చెరువులోకి దూకింది.దీంతో తల్లిని రక్షించేందుకు నితిన్ నీటిలోకి దూకాడు. కానీ తల్లీకూతురు నీళ్లలో మునిగి గల్లంతయ్యారు. దీంతో నితిన్ ఇంటికి వచ్చి తండ్రి సతీశ్‌కు జరిగిన విషయం తెలియజేశాడు. బుధవారం ఉదయాన్నే గ్రామస్తులు, ఫైర్ సిబ్బంది చెరువులో గాలించి అనిత, ధనుశ్రీ మృతదేహాలను బయటకు తీశారు. వీరిద్దరి మృతిపై హుణసూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. నితిన్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఆస్పత్రికి తరలించారు.

## ఇక బాలక్ రామ్



**లక్నో :** అయోధ్య వాసుల ఐదు శతాబ్దాల కల, కోట్లాది మంది రామ భక్తుల స్వప్నం ఎట్టకేలకు సాకారమైంది. అయోధ్యలో రామజన్మభూమిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో జనవరి 22న బాల రాముడిని ప్రాణ ప్రతిష్ట చేశారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా గర్భగుడిలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ట జరిగింది. ఈ వేడుక అనంతరం బాల రాముడి దివ్య రూపాన్ని దర్శించుకుని యావత్ దేశం పులకించింది. అయితే ఆలయంలో నూతనంగా ప్రతిష్టించిన రామ్‌లల్లాను ఇకపై 'బాలక్ రామ్'గా పిలవనున్నారు. ఈమేరకు ట్రస్టీ పూజారి అరుణ్ దీక్షిత్ వెల్లడించారు. మందిరంలో రాముడు పసి బాలుడిగా భక్తులకు దర్శనమిస్తున్నాడు. అందుకే రామచంద్రమూర్తి పేరును బాలక్ రామ్‌గా పిలవాలని నిర్ణయించినట్లు తెలిపారు.ఇక బాల రాముడి దివ్య దర్శనానికి మంగళవారం నుంచి సామాన్యులను కూడా అనుమతిస్తున్నారు. ఆలయంలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట పూర్తికావడంతో హారతి వేళలు, పూజా కార్యక్రమాల్లో కొన్ని మార్పులు చేశారు. రోజుకు ఆరుసార్లు రామచంద్రమూర్తికి హారతి ఇవ్వాలని నిర్ణయించినట్లు ట్రస్టుకు చెందిన ఆచార్య మిథిలేశ్‌నందిని శరణ్ తెలిపారు. ప్రతిరోజూ మంగళ(నిద్ర లేపేందుకు), శ్రింగార (అలంకరణ సేవలో), భోగ (నైవేద్య సమర్పణ వేళ), ఉతపన్(దిష్టి తగలకుండా), సంధ్యా (సాయంత్రం వేళ), శయన హారతి (స్వామి వారిని నిద్ర పుచ్చేందుకు) హారతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.బాల రాముడికి నిత్యం సమర్పించే నైవేద్యాలను కూడా ట్రస్టు నిర్ణయించింది. పూరి, కూరతోపాటు రబీ?ఖీర్, పాలు, పండ్లు, పాలతో చేసిన స్వీట్లను నైవేద్యంగా సమర్పించనున్నారు. సోమవారం తెలుపు, మంగళవారం ఎరుపు, బుధవారం ఆకుపచ్చ, గురువారం పసుపు, శుక్రవారం గోధుమ, శనివారం నీలం, ఆదివారం గులాబీ రంగు వస్త్రాల్లో 'బాలక్ రామ్' భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

# ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది - జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్








**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ గౌస్ అలాం తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ల దినోత్సవం సందర్భంగా తీసుకొస్తున్న మార్పులు, సంస్కరణలు, ఓటు హక్కు, దాని ప్రాధాన్యత అంశాలపై వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా రంగోలి పోటీలు, నూతన ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ, సీనియర్ సిటిజన్ల కు సన్మానం, పాఠశాలలు, కళాశాల స్థాయిలోని పిల్లలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు వంటి కార్యక్రమాలను నిర్వహించి అవగాహన కల్పించారు. వృద్దులకు, దివ్యాంగ ఓటర్లకు ఇంటి దగ్గరికి వెళ్లి ఓటు వేసే విధంగా అవకాశం కల్పించడం జరిగిందన్నారు. అనంతరం ఓటు హక్కు పై కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత, విద్యార్థులు ఓటు ప్రాధాన్యతపై అవగాహన ప్రదర్శనలు ఆహ్వానితులను అలరించాయి. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లను శాలువా తో సన్మానించారు. ఓటరు అవగాహనపై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. అంతకుముందు స్థానిక ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో ఓటు హక్కు వినియోగం, నమోదుపై నిర్వహించిన బైక్ ర్యాలీని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి జెండా ఊపి ప్రారంభించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి కలెక్టర్ చౌక్, తెలంగాణ చౌక్, వినాయక్ చౌక్, నేతాజీ చౌక్, పంజాబ్ చౌక్ మీదుగా జడ్పీ కార్యాలయ సమావేశ మందిరం వరకు సాగిన బైక్ ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ, అటవీ అధికారి, పోలీస్, ఎన్.సీ.సీ, వివిధ వర్గాల ప్రజలు, అధికారులు, యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, డివైఎస్ఓ వెంకటేశ్వర్లు, డిపిఆర్ఓ ఇ.విష్ణువర్ధన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, జిల్లా అధికారులు, పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# దేశమా నీకు ఇదే వందనం



దేశమా నీకు ఇదే వందనం
స్వాతంత్ర మా నీకు ఘన స్వాగతం
ఈ దేశం నాది ఈ రాజ్యం నాది అని ప్రతి పౌరుడుకి
ఉండాలి ప్రతి పౌరుడు సైనికుల పోరాడాలి!!!

మూడు రంగుల జెండా మురిసిపోవాలి
భారతీయులంతా కలసి రావాలి
స్వాతంత్ర దినోత్సవ సంబరాలలో
మన దేశ ఖ్యాతి దిగంతాలు దాటాలే!!!

నాటి నేతల స్ఫూర్తిని పునికి పుచ్చుకోవాలి
అభివృద్ధి బాటలో అడుగులు వేయాలి
భారతావని గుండెల్లో వెలుగులు నింపాలి
విజ్ఞాన గనిగా నింగిన అంటారు
నా భారతదేశం!!!

రచన :-
దేవులపల్లి రమేశ్,
నంగునూర్, సిద్దిపేట జిల్లా
చరవాణి :-9963701294

# ఉందిగా జాగా...వేసేయ్ పాగా



**వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఓరుగల్లు భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. నగరం చుట్టూ పక్కల ఎకరం ధర లక్షల్లో ఉంటే ఇప్పుడు రూ.కోట్లలోకి ఎగబాకింది. నగరం, నగరం చుట్టు పక్కల జరుగుతున్న అభివృద్ధితో పాటు పట్టణ జనాభా సైతం గణనీయంగా పెరగడం భూముల రేట్లు పెరగడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అయితే భూముల విలువ పెరుగుదలతో పాటు అంతే స్థాయిలో వివాదాలు, కబ్జాలు పెరగడం గమనార్హం. అధికారం అండదండలతో, రెవెన్యూ, న్యాయ వ్యవస్థలోని లోపభూయిష్టమైన విధానాలను ఆకలింపు చేసుకుంటున్న కబ్జా గ్యాంగులు భూ వివాదాలకు పాల్పడుతూ కోట్ల విలువ చేసే భూములను ఆక్రమించుకుంటున్నాయి. గడిచిన ఐదేళ్లలో ఈ తరహా దందాలు, కేసులు ఓరుగల్లులో వేలల్లో ఉండటం గమనార్హం. రెవెన్యూ అధికారులే స్వయంగా నకిలీ పత్రాల తయారీలో కబ్జా గ్యాంగులకు సహకరిస్తుండడం విశేషం. కొంతమంది పోలీసులు కబ్జా గ్యాంగుల భారీ ఆఫర్లకు సరెండరవుతున్నాయి. కబ్జాగ్యాంగులు ఎక్కడెక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయో తొలుత గుర్తిస్తాయి. సదరు స్థలాల వైపు అసలు యజమానులు ఏళ్లుగా రాకపోవడాన్ని తెలుసుకుంటాయి. ఆ స్థలాల యజమానులు స్థానికంగా ఉండడం లేదని నిర్ధారించుకుంటాయి. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలోని కొందరి వ్యక్తుల ద్వారా సదరు స్థలం యాజమాన్య హక్కులపై సర్వం సమాచారం రాబడతారు. చాలా ఏళ్ల క్రితమే సదరు యజమాని ఆ భూమిని వేరే వ్యక్తులకు విక్రయించినట్లుగా, అతను దాన్ని మరికొందరికి అమ్ముకున్నట్లుగా, వారి నుంచి తాము కొనుగోలు చేసినట్లు ఫేక్ లింక్ డాక్యుమెంట్లు సృష్టిస్తారు. నిజమైన యజమాని వస్తే తమ దగ్గరున్న పత్రాలు చూపించి తమదే ఈ భూమని బెదిరింపులకు దిగుతారు.కబ్జా చేయాల్సిన స్థలంపై ఫేక్ లింక్ మరియు డాక్యుమెంట్స్‌ను సృష్టిస్తున్న కబ్జా గ్యాంగులు తమ భూమిని కబ్జా చేస్తున్నారంటూ అసలు యజమానికంటే ముందే కోర్టుకెక్కి రాద్ధాంతం మొదలుపెడతారు. అంతకంటే ముందు సదరు యజమాని ఒకే ఆస్తిని ఇద్దరు వేర్వేరు వ్యక్తులకు విక్రయించినట్లు నకిలీ పత్రాలు సృష్టిస్తారు. ఆ ఇద్దరు వ్యక్తులు అదే స్థలాన్ని మరికొంతమందికి విక్రయించినట్లుగా లింక్ డాక్యుమెంట్లు తయారు చేస్తారు. వాస్తవానికి వీరంతా కబ్జా ముఠాల సభ్యులే అయి ఉంటున్నారు. తమ మధ్య ఆస్తికి సంబంధించిన వివాదం ఏర్పడిందని, వాటి పత్రాలు తమవద్ద ఉన్నాయని విన్నవిస్తూ వేర్వేరుగా న్యాయస్థానాల్ని ఆశ్రయిస్తున్నారు. వాటన్నింటిని పరిశీలించి వాదనలు విన్న అనంతరం వారిలో ఎవరికో ఒకరికి అనుకూలంగా న్యాయస్థానం తీర్పిస్తే, ఆ ప్రతులను పట్టుకుని తాము ఎంపిక చేసుకున్న జాగాలో పాగా వేస్తారు. వాస్తవంగా చూస్తే ఇక్కడ తప్పుడు పత్రాలు తయారు చేయడం, వాటిని ఆధారంగా చేసుకుని తమ మధ్య ఆస్తికి సంబంధించిన వివాదం ఏర్పడిందని, వాటి పత్రాలు తమవద్ద ఉన్నాయని చెబుతూ వారు వేర్వేరుగా న్యాయస్థానాలను ఆశ్రయించడం అనేది పక్కా ప్రణాళికతో జరుగుతుంది. వాటన్నింటినీ పరిశీలించి, వాదనలు విన్న అనంతరం వారిలో ఎవరికో ఒకరికి అనుకూలంగా న్యాయస్థానం తీర్చిస్తే, ఆ ప్రతులను పట్టుకుని తాము ఎంపిక చేసుకున్న జాగాలో పాగా వేస్తారు.స్థలం యజమాని తనకున్న భూమిలో కొంత భాగాన్ని ఆయన బంధువుకు గిఫ్ట్ డీడ్ రాసినట్లుగా కబ్జాగ్యాంగులు నకిలీ పత్రాలు సృష్టిస్తాయి. యజమాని సమీప బంధువు సదరు స్థలాన్ని ఒకరికి విక్రయించగా ఆయన నుంచి వారి నుంచి తాము కొనుగోలు చేసినట్లుగా నకిలీ లింకు డాక్యుమెంట్లను సృష్టిస్తారు. అసలైన యజమానులకు, వారి వారసులెవరైనా ఆ స్థలంలోకి వచ్చి తమదేనని గట్టిగా నిలదీస్తే, ఆ ఆస్తిలో కొంత భాగమే మీదని, మిగతాదంతా తమదేనని చెప్పి దబాయిస్తారు. అందుకు ఆధారంగా తాము తయారు చేసిన లింకు డాక్యుమెంట్లను చూపెడుతున్నారు.స్థల యజమాని నుంచి కొంతమంది భూమి కొనుగోలు చేసినట్లుగా నకిలీ పత్రాలు సృష్టిస్తారు. ఆ ఆస్తి ఇద్దరు లేదా ముగ్గురు చేతులు మారినట్లుగా లింకు డాక్యుమెంట్లను తయారు చేస్తారు. వారి నుంచి భూమి అభివృద్ధి కోసం తాము తీసుకున్నట్లుగా జీపీఏ ఒప్పందం కుదుర్చుకున్న పత్రాలను చూపెడతారు. ఆ తర్వాత సదరు స్థలంలో కార్యకలాపాలు మొదలుపెట్టేస్తారు. యజమాని గుర్తించే లోపే అక్కడ భవనాలు నిర్మించడమో, లేదా ప్లాట్లుగా విభజించి విక్రయించడమో చేస్తారు. ఈ తరహా దందాలో యజమాని మోసపోవడంతో పాటు, సదరు స్థలంలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు.ఆస్తిపత్రాలు పోయాయని, కొత్తవి మంజూరు చేయాలని కోరుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కబ్జా చేయాలనుకుంటున్న స్థల వివరాలతో దరఖాస్తు చేస్తున్నారు. కొందరు అధికారులు, సిబ్బంది సహకారంతో కొత్త తేదీలతో రిజిస్ట్రేషన్ జరిగినట్లుగా ఉన్న పత్రాలను పొందుతారు. ఈ పత్రాల ఆధారంగా కొన్నాళ్లపాటు ఖాళీ ఆస్తి పన్ను, ఇతరత్రా పన్నులు చెల్లిస్తుంటారు. కొన్ని రోజుల తర్వాత ఆ స్థలాన్ని ఆక్రమించేస్తారు. యజమాని ఈ విషయం గుర్తించి స్థలం మీదకు వెళ్తే తమ పేరిట ఉన్న పత్రాలను చూపించి బెదిరింపులకు పాల్పడుతారు. స్టాంప్ వెండర్స్ సాయంతో కూడా భూకబ్జాలకు పాల్పడుతుంటారు. స్టాంప్ వెండర్స్ రోజువారీ విక్రయాల రిజిస్ట్రర్‌లోని క్రమసంఖ్యలో అక్కడక్కడ ఖాళీలు వదిలేలా చూస్తారు. కొంతకాలం తర్వాత పాత తేదీలతో కూడిన ఆ స్టాంపు పేపర్లను కబ్జా ముఠా సభ్యులు కొంటారు. వాటిని అడ్డం పెట్టుకుని నకిలీ పత్రాలు సృష్టిస్తూ భూముల కబ్జాలకు పాల్పడుతున్నారు

http://vaasthavanestham.com
# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో – వాస్తవం పక్కా...



# స్థానిక వార్తలు

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం - ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



**వాస్తవ నేస్తం,కూకట్పల్లి:** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని నవోదయ కాలనీ లో కాలనీ అసోసియేషన్ వారి ఆద్వర్యంలో రూ.2 లక్షల 80 వేల రూపాయల అంచనా వ్యయం తో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ నవోదయ కాలనీ వాసులు నా విజ్ఞప్తి మేరకు కాలనీ లో సీసీ కెమెరాల ఏర్పాటు కు కాలనీ వాసులు ముందుకు రావడం చాలా సంతోషకరమైన రోజు అని నేడు ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు. కాలనీ లలో నేరాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడుతాయి అని , కాలనీ వాసులు ముందుకు రావడం చాలా అభినందనీయం అని, సీసీ కెమెరా ల ఏర్పాటు కు చొరవ తీసుకోవడం చాల గొప్ప విషయం అని, శాంతి భద్రతలు కాపాడటానికి పోలీస్ అధికారులు ఎంతగానో కృషి చేస్తున్నారని, సీసీ కెమెరాల ఏర్పాటు పై కాలనీ వాసులకు విస్తృత ప్రచారం తో అవగాహన కలిపిస్తున్నారని, ఒక సీసీ కెమెరా 100 మంది పోలిసులతో సమానమని, సీసీ కెమెరాల వలన కేస్ ల పరిష్కారం సులువు అవుతుంది అని, నేర శోధన, నేర నివారణ కు ఎంతో తోడ్పడతాయి అని, కావున అన్ని కాలనీ వాసులు ముందుకు వచ్చి తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు తనవంతు కృషి గా ఎమ్మెల్యే ఫండ్ (సీడీపీ) ద్వారా 1 కోటి రూపాయలు కేటాయించడం జరిగినది అని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. మహిళల, ప్రజల రక్షణకు, దొంగతనాలు అరికట్టడానికి సి.సి.కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతుంది అని 24 గంటల పాటు నిరంతరం పనిచేసే నిఘా నేత్రలను ప్రతి కాలనీ, బస్తీలో ఏర్పాటు చేసుకోవాలి అని, ప్రతి కాలనీలో, బస్తీలో ఇలాంటి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంవలన దొంగతనాలు, నేరాలు జరిగినపుడు పోలీసులకు నేరస్తులను గుర్తించడంలో కీలక సమయం లో సాక్ష్యంగా ఎంతగానో ఉపయోగపడుతాయి అని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. అన్ని కాలనీల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని, మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధం అని, ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి వచ్చిన పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు. అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ మరియు నియోజకవర్గ అభివృద్ధికి శాయ షెక్తుల కృషి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు దొడ్ల రామకృష్ణ గౌడ్, శర్మ, సంతోష్ రావు, కాశినాథ్ యాదవ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు నవోదయ కాలనీ ప్రెసిడెంట్ బివి రమణ, వైస్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, సెక్రటరీ సిద్ధార్థ, గణేష్, లక్ష్మణ్, శివశంకర్, మదన్, శ్రీనివాస్, భార్గవ్, కిషోర్ రెడ్డి, శ్రీకాంత్, పల్లాల్ రాజు, సంతోష్ బిరాదర్, స్వాతి, కళ్యాణి, శ్రీలత, కావ్య, కవిత, వనిత, శివ పార్వతి,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి రానున్న ఎమ్మెల్యే



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** జిన్నారం మండలం కాజిపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవం చేసేందుకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి రానున్నారని మండల అధ్యక్షుడు నాయకోటి రాజేష్ అన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, రాష్ట్ర నాయకులు వెంకటేశం గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, సొసైటీ చైర్మన్ లు, సొసైటీ డైరెక్టర్లు, కో ఆప్షన్ సభ్యులు, గుడి చైర్మన్ లు, గుడి డైరెక్టర్లు, భిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు సభ్యులు, భిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అనుబంధ సంఘాల అధ్యక్షులు సభ్యులు, హాజరు కావాలని ఆయన కోరారు.

## యువత ఓటు హక్కును ఉపయోగించుకోవాలి
**– బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి**



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బీజేవైఎం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పవన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేపట్టిన నమో నవమాత దాత సమ్మెల కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. దేశంలో యువత రాజకీయాల్లోకి రావాలని తమ యొక్క ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.18 సంవత్సరాలు దాటిన యువత, విద్యార్థులు ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. యువత రాజకీయాలకు వచ్చినప్పుడే దేశం యొక్క కీర్తి ప్రతిష్ట పెంపొందించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శిలు, వివిధ పదాధికారులు, యువమోచా నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే




**వాస్తవ నేస్తం,కూకట్పల్లి:** బాలానగర్ మండలం హైదర్ నగర్ లో గల అల్పసంఖ్యాకుల మైనార్టీ గురుకుల పాఠశాల మరియు కళాశాలను కూకట్పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న గురుకుల పాఠశాల ఉచిత విద్య సందర్భంగా 5, 6 7, 8 తరగతి లకు ప్రవేశాలు జరుగుతున్నాయని ఇందులో భాగంగా మైనారిటీ విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాల నిర్మాణం కొరకు దూలపల్లి లో మరొక రెండున్నర ఎకరాలు కేటాయించామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రశంసా పత్రాలను అందించారు. అంతేకాకుండా విద్యార్థులకు నోటుబుక్స్, యూనిఫామ్, బూట్లు, దుప్పట్లు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. జితేందర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకలు



**వాస్తవ నేస్తం,అనంతగిరి:** కోదాడ పట్టణంలోని శ్రీరంగాపురం లో గల ప్రసిద్ధిగాంచిన హజరత్ మౌలాలి ఉరుసు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తుల నడుమ గంధమును శిరస్సుపై పెట్టుకొని శ్రీరంగాపురం నుంచి ఖమ్మం క్రాస్ రోడ్ వరకు ఊరేగింపుగా మేళ తాళాలతో దర్గా వద్దకు తీసుకువచ్చారు. హజరత్ మౌలాలి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కందుల. చంద్రశేఖర్,ఉర్సు కమిటీ అధ్యక్షులు బొజ్జ మియా మేస్త్రి,సైదా, ఉమర్ జాన్,సలీం, బుజ్జి,నాగుల్, జానీ పాషా తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమ కార్మికులకు చెక్కులు పంపిణీ చేసిన లేబర్ కమిషనర్



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** పటాన్చెరు నియోజకవర్గంలోని ఐడిఏ బొల్లారం పారిశ్రామికవాడలోని హార్టెక్స్ రబ్బరు పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు కనీస వేతనాలను ఇవ్వడం లేదంటూ రాష్ట్ర కార్మిక నాయకులు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, వరప్రసాద్ రెడ్డిలు జాయింట్ లేబర్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన జాయింట్ లేబర్ కమిషనర్ చతుర్వేది రవీందర్ రెడ్డి'లు యజమాన్యంతో మాట్లాడి కార్మికులకు న్యాయం చేశారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా వారు పాల్గొని పరిశ్రమకు చెందిన 40 మంది కార్మికులకు తొమ్మిది లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు సంబంధించిన లేబర్ కమిషనర్'కు ఇతర అధికారులకు కార్మిక నాయకులు వరప్రసాద్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం.ఎస్ కార్మిక నాయకులు రియాజ్, హార్టెక్స్ కంపెనీ కార్మిక యూనియన్ నాయకులు లఖన్ సింగ్, ఉద్యానంద్, ఉమాకాంత్, సునీల్ సింగ్, జితేందేర్ యాదవ్, సతీష్ సింగ్, ధర్మేందర్ యాదవ్, శ్రీరామ్, తివారీ, అఖిలపక్ష నాయకులు, కార్మికులు, మున్సిపల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోలాం గిరిజనులు విద్యపై దృష్టి సారించి ఉన్నత స్థానాలకు ఎదగాలి





**తల్లిదండ్రులు పిల్లలకు చదువుపై ఆసక్తి కలిగేలా పాఠశాలలకు పంపించాలి**

**జిల్లా ఎస్పీ గౌష్ ఆలం**

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** పోలీసులు జిల్లా ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలలో భాగంగా కోలం గిరిజనులకు ఉచితంగా బ్లాంకెట్లు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో 300 బ్లాంకెట్లను నిరుపేద ఆదివాసి కొలాం గిరిజనులకు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్ అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మొదటిసారిగా గ్రామానికి నూతనంగా జిల్లా కు వచ్చిన ఎస్పీకి సాంప్రదాయ గిరిజన సాంస్కృతిక పద్ధతులలో ఘనంగా స్వాగతం పలికి, శాలువా పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. కొలాం గిరిజన విద్యార్థులు విద్యపై దృష్టి సారించాలని, ప్రభుత్వ ఉద్యోగాలను సాధించే విధంగా విద్యనాభ్యసించాలని సూచించారు. తమ వంతు కృషిగా ప్రభుత్వ నోటిఫికేషన్ వచ్చినప్పుడు ఉచితంగా శిక్షణను, పోలీసుల ద్వారా సలహాలను సూచనలను అందిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు ముఖ్యంగా చిన్నప్పటినుండే పిల్లలకు చదువుపై ఆసక్తి కలిగేలా వ్యవహరించి పాఠశాలలకు వెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. యువత విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ప్రభుత్వ అధికారులుగా ఎదగాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అవలంబిస్తున్న పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. అభివృద్ధికి ముఖ్యంగా విద్య ఎంతగానో దోహదపడుతుందని ప్రతి ఒక్కరూ విద్యపై దృష్టి సారించి ఉన్నత విద్యను అభ్యసించేలా చూడాలని తెలిపారు. తమ యొక్క భాష సాంప్రదాయం పద్ధతులు తనకి ఎంతగానో నచ్చాయని జిల్లా ఎస్పీ తెలిపారు. అనంతరం గిరిజనులతో కలిసి సామూహికంగా భోజన కార్యక్రమంలో పాల్గొని వారి ఆతిథ్యాన్ని స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ డిఎస్పీ సిహెచ్ నాగేందర్, సీఐ రామకృష్ణ, ఎస్సై సునీల్, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, ప్రజలు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో స్టాక్ మార్కెట్ పై అవగాహన సదస్సు

**పెద్దపల్లి :** స్టాక్ మార్కెట్ లో ఒడిదుడుకులపై పెట్టుబడిదారులకు అవగాహన అవసరమని మెటల్ అండ్ ఎనర్జీ సంస్థ సీనియర్ ప్రతినిధి వెంకట కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల బీకాం, ఎంకాం విద్యార్థినులకు మూలధన మార్కెట్లలో మదుపు చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టే ముందు ఆయా సంస్థల పురోగతి, వ్యాపార వాణిజ్యస్థాయి, మార్కెట్లో షేర్ క్యాపిటల్, టర్నోవర్, ఉద్యోగుల సంఖ్య, తదితర విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. అలాగే అగ్రశ్రేణి కార్పోరేట్ సంస్థల పని తీరు, పరిశీలించాలని, స్టాక్ కు కమోడిటీకి వ్యత్యాసాలతో పాటు కమోడిటీలో వర్తకం చేస్తున్నప్పుడు కలిగే ప్రయోజనాలను వాటిలో రిస్క్ నష్టాలను వివరించారు. ఈ సదస్సులో కళాశాల కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్ ప్రిన్సిపల్ జే. రవీందర్, లెక్చరర్స్ పాల్గొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, RNI NO: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com